www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
ఆదివారం
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి। 08, డిసెంబర్ 2024
సంపుటి: 6 సంచిక: 189, పేజీలు: 12, వెల: రూ.5/-

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా చక్రపాణి

వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 7:
రాష్ట్ర టీఎస్పీఎస్ చైర్మన్ పనిచేసిన ఘంటా చక్రపాణి కి మరో కీలక పదవిని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఆయనను రాష్ట్ర డాక్టర్ బి ఆర్ అంభేద్కర్ యూనివర్సిటీ కి వైస్ ఛాన్సలర్ గా నియమించింది ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శని వారం నాడు ఘంటా చక్రపాణి రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ లోని సిఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని ఆయన సిఎం కు తెలిపారు.



ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఆయనకు అభినందనలు తెలిపారు, ఈ సందర్భంగా సిఎం ను చక్రపాణి శాలువతో సన్మానించారు.





## యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని జాతికి అంకితం చేసిన ముఖ్యమంత్రి

- 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం
- ఈ ప్రాజెక్ట్‌లో 8 వందల మెగావాట్ల యూనిట్-2 నుంచి ఉత్పత్తి
- వాణిజ్య ప్రాతిపదికన ఉత్పత్తి గ్రిడ్‌కు అనుసంధానం

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 7:
నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని (వైటీపీఎస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం జాతికి అంకితం చేశారు. నాలుగు వేల మెగావాట్ల స్థాపిత ఉత్పత్తి సామర్థ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో 800 మెగావాట్ల యూనిట్-2 నుంచి వాణిజ్య ప్రాతిపదికన ఉత్పత్తి, గ్రిడ్‌కు అనుసంధానించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు థర్మల్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ థర్మల్ స్టేషన్‌లోని 800 మెగావాట్ల మిగతా..2లో

## కేసీఆర్ ఏనాడైనా ప్రతిపక్ష పాత్రను పోషించారా?

- గెలిస్తే ఉప్పొంగడం... ఓడితే కుంగిపోవడమా కేసీఆర్?
- కేసీఆర్ స్థాయికి కుంగిపోవడం తగదు
- ఓడిపోగానే ఫాంహౌస్‌కు వెళ్లిపోయారు
- కేసీఆర్ గాలి బ్యాచ్‌ను తమ పైకి వదిలి వెళ్లారు
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- నల్గొండలో కాంగ్రెస్ విజయోత్సవ సభ నిర్వహణ
- మీరు దొంగల బండి ఎక్కితే మీపై ఉన్న గౌరవం పోతది
- కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్‌కు సూచన
- బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



నల్గొండ,డిసెంబర్7(వెలుతురు న్యూస్):
ఈ ఏడాది కాలంలో కేసీఆర్ ఏనాడైనా ప్రతిపక్ష నేతగా తన పాత్రను పోషించారా? బీఆర్ఎస్ హయాంలో తమ ఎమ్మెల్యేలను లాక్కుంటే వెనుకడుగు వేయకుండా పోరాడామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గెలిస్తే ఉప్పొంగిపోవడం... ఓడితే కుంగిపోవడం కేసీఆర్ స్థాయికి తగదన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ ప్రజల్లోనే ఉండి మిగతా..2లో






## అర్బన్ నక్సల్స్ చేతిలో రేవంత్ సర్కార్ బందీ

- భాగ్యనగర్‌ను మరో బంగ్లాదేశ్‌గా మార్చే కుట్ర
- రేవంత్‌ను జనం సీఎంగా గుర్తించడం లేదు
- ఏ సర్వేలో చూసినా కాంగ్రెస్ ది మూడో స్థానమే....
- కాంగ్రెస్ సర్కార్‌కు సంక్రాంతి వరకు డెడ్ లైన్...
- ఆలోపు 6 గ్యారంటీలను అమలు చేయకుండా గ్రామాల్లో తిరగనీయం
- 25 వేల పోస్టులకే నోటిఫికేషన్లకు ఇచ్చారు... మరి 55 వేల పోస్టులు ఎట్లా భర్తీ చేసినట్లు?
- రేవంత్ సర్కార్ మూర?త్వంతో నిరుద్యోగుల బతుకులు సర్వనాశనమైనయ్
- ఈసారి జీహెచ్ఎంసీ మేయర్ పీఠం కాషాయ జెండాదే
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కు బుద్ధి చెబుతాం
- 6 గ్యారంటీలపై పాదయాత్రకు సిద్ధమా?
- తెలంగాణలో జరిగే అభివృద్ధి పనులన్నింటికీ నిధులిచ్చేది కేంద్రమే....
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగిన బీజేపీ ఫైర్ బ్రాండ్

హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 07:
అర్బన్ నక్సల్స్ చేతిలో రేవంత్ రెడ్డి సర్కార్ బందీగా మారిందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ లో మాదిరిగా భాగ్యనగర్ లోనూ హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. పరిస్థితి ఇట్లానే ఉంటే భాగ్యనగర్ మరో బంగ్లాదేశ్ గా మార్చే కుట్రలకు తెరదీశారని అన్నారు. 'భాగ్యనగర్ ప్రజలారా... స్వామి వివేకానంద, బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, కొమరం భీం, సేవాలాల్ మహారాజ్ లా మారతారా? లేక నక్సలైట్లుగా మారతారా? ఆలోచించండి"అని కోరారు. రేవంత్ రెడ్డి వాడుతున్న భాష, ఆడుతున్న అబద్దాలను చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలెవరూ ఆయనను సీఎంగా గుర్తించడం లేదన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ కూ మూడో స్థానం తథ్యమన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎగిరేది కాషాయ జెండాయేనని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ఏడాది పాలనా వైఫల్యాలపై శనివారం రోజున బీజేపీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన 'బహిరంగ సభ'కు విచ్చేసిన మిగతా..2లో



## కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 07:
శనివారం రోజున మినిస్టర్ క్వార్టర్స్ లో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గారిని కలిసి కల్లు గీత కార్మికుల సమస్యలపై వినతి పత్రం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మిగతా..2లో



## తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రావాలి

మాజీ సీఎం కేసీఆర్‌కు మంత్రి పొన్నం ఆహ్వానం

హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 07:
ఈనెల 9న ప్రభుత్వం తలపెట్టిన తెలంగాణతల్లి విగ్రహా విష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని, మంత్రి పొన్నం ప్రభాకర్ మాజీ సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించారు. మిగతా..2లో

## నిబంధనల ప్రకారం కోడెల పంపిణీ


- దుష్ప్రచారం చేస్తే చర్యలు తప్పవు
- వేములవాడ వివాదంపై మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్,డిసెంబర్7(వెలుతురు న్యూస్):
వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని కోడెలను అక్రమంగా విక్రయించినట్లు వచ్చిన వార్తల్లో నిజంలేదని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే రీతిలో కుట్రపూరితంగా దుష్ప్రచారం జరిగిందంటూ, ప్రచారంలో ఉన్న వార్తలను ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి మిగతా..2లో



## జైలుకు వెళ్లే తొందరలో కెటిఆర్

- బాంబులు అనగానే భయంతో వణుకు
- మంత్రి పొంగులేటి విమర్శలు



హైదరాబాద్,డిసెంబర్7(వెలుతురు న్యూస్):
నేను బాంబులు అనగానే కేటీఆర్ ఉలిక్కిపడ్డారు.. బాంబులు పేలతాయి అనగానే ఢిల్లీకి ఎందుకు వెళ్లారు... కేంద్ర పెద్దలతో ఏం ఒప్పందం చేసుకున్నారని ,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరోసారి విరుచుకుపడ్డారు. జైలుకు వెళ్లడానికి కేటీఆర్‌కు ఆత్రుత ఎందుకు అంటూ హాట్ కామెంట్స్ చేశారు. తప్పు రుజువైనప్పుడు జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. నేను అమిత్ షా కాళ్లు మొక్కిన అనడానికి సిగ్గుండాలి.. నా తల్లిదండ్రుల తర్వాత నేను కేసీఆర్ కాళ్లు మాత్రమే మొక్కిన. మెడలో పార్టీ కండువా వేసి ఆ కండువాతో నా గొంతు కోశారు. ఐదేళ్లు నా రాజకీయ జీవితం నాశనం చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు పగటి కలలు మానుకోవాలని హితవుపలికారు. బీఆర్ఎస్ పార్టీ మిగతా..2లో

## కాంగ్రెస్ పాలనపై అప్పుడే బోర్

- మళ్లీ అధికారం బీఆర్ఎస్‌కే ఓ సర్వే ప్రతినిధి వెల్లడి
- షార్ట్‌ఫిల్మ్ ప్రివ్యూ కార్యక్రమంలో మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్,డిసెంబర్7 (వెలుతురు న్యూస్):
కాంగ్రెస్ పాలనపై ప్రజలకు అప్పుడే బోర్ కొట్టిందని, మళ్లీ అధికారం కేసీఆర్‌కే దక్కుతుందని ఓ సర్వే ప్రతినిధి చెప్పినట్లు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నమ్మి నానబోస్తే షార్ట్ ఫిల్మ్ ప్రివ్యూ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఇవాళ నా వద్దకు ఓ సర్వే ప్రతినిధి వచ్చి.. ఈ ఏడాది పాలన గురించి విశ్లేషణాత్మకంగా చెప్పారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తే ఎలా ఉంటుందో చెప్పారు. ఆయన చెప్పిన మాట ఏంటంటే.. సహజంగా ఏ ప్రభుత్వం మీద అయినా మూడు, నాలుగేండ్ల తర్వాత కోపం వస్తది.. తెలంగాణ ప్రజలకు ఓపిక పట్టే గుణం ఉంది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఏడాదిలోనే మనసు విరిగింది. కేసీఆర్ నాయకత్వంలో పోరాటాలు చేస్తున్నారో దీన్ని తప్పకుండా కొనసాగించండి.. అధికారం కేసీఆర్‌కు దక్కుతుందని చెప్పారని కేటీఆర్ తెలిపారు. గాంధీ భవన్ మిగతా..2లో







## నైట్ ఔట్ కోసం వెళ్తూ ఐదుగురి దుర్మరణం


- యాదాద్రి భువనగిరి జిల్లాలో తీవ్ర విషాదం
- చెరువులోకి దూసుకెళ్లిన కారు.. ఐదుగురు దుర్మరణం
- ప్రమాదం నుంచి బయట పడ్డ మణికంఠ
- మృతులు హర్ష, దినేష్, బాలు. వినయ్. వంశీలుగా గుర్తింపు
- మృతుల కుటుంబాల్లో తీరని శోకం

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 7:
యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్ పూర్ గ్రామానికి సమీపంలో ఉన్న చెర్వు లోకి కారు దూసుకెళ్లింది,ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రమాదానికి గురైన కారు హైదరాబాద్ ఎల్ బి నగర్ లోని ఆర్టీసీ కాలనీ నుంచి ఆరుగురు వ్యక్తులు కారులో విలేజ్ టూర్ నిమిత్తం వలిగొండ కు బయలుదేరారు. అయితే విజయ వాడ హైవే కొత్తగూడెం క్రాస్ రోడ్డు నుంచి భూదాన్ పోచంపల్లి మీదుగా వలిగొండ కు వెళ్లే మార్గంలో భూదాన్ పోచంపల్లి మండలం జలాల్ పూర్ గ్రామ శివారులోని రోడ్డు మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి చెరువు లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఐదు మంది మిగతా..2లో

## కాంగ్రెస్ అంటేనే ఏమార్చడం

- పచ్చటి పొలాల్లో చిచ్చుపెడుతున్న రేవంత్
- ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్7 (వెలుతురు న్యూస్):
కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయడమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చి పచ్చటి పొలాల్లో చిచ్చు బెడుతున్నారని విమర్శించారు. గిరిజనుల బిడ్డలను జైళ్ల పాలు చేశారని ఆగ్రహం



వ్యక్తం చేశారు. రేంత్‌రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్ పద్ధతా అని నిలదీశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా విషయంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని, ఎన్నికల తర్వాత మాట తప్పిన వైఖరిని ఆయనకు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు ఎవరూ తమ బాధను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట తప్పి, నిబంధనలకు విరుద్ధంగా సర్వేలు నిర్వహిస్తున్నారని, భూసేకరణ పత్రాలపై బలవంతంగా సంతకాలు మిగతా..2లో



## రాష్ట్ర ఎఫ్‌డిసిసి చైర్మన్ దిల్‌రాజ్ ఎంపిక

### - సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన దిల్ రాజ్

వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 7: రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఎన్నిక కావడంతో ఆయన కు సినీ పరిశ్రమ ప్రముఖులు అభినందనలు తెలిపారు. కాగా దిల్ రాజు శనివారం నాడు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ని కలిశారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు తనకు ఇచ్చిన చైర్మన్ పదవి కి న్యాయం చేస్తానని సిఎం కు హామీ ఇచ్చారు, అలాగే తన కు ఇచ్చిన పదవికి సిఎం కు దిల్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు ను శాలువ కప్పి సిఎం రేవంత్ రెడ్డి సత్కరించారు, ఈ కార్యక్రమంలో నిర్మాత అల్లు శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

మొదటిపేజీ తరువాయి..

యం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు. మరియు ఉపాధ్యక్షులు వి వెంకట నరసయ్య, గౌడ యువజన సంఘం గౌరవాధ్యక్షులు గనగాని మల్లేశం గౌడ్ తదితరులు. కల్లుగీత వృత్తిలో ప్రమాద నివారణకు ప్రభుత్వం ఇచ్చే సేఫ్టీ కిట్లులు 10 వేలు మాత్రమే పంపిణీ చేశారని మిగతా వృత్తి చేసే వారందరికీ వెంటనే ఇవ్వాలని కోరడం జరిగింది. ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్ గ్రేషియా 7 కోట్ల 90 లక్షలు వెంటనే విడుదల చేయాలని, సీఎం రేవంత్ రెడ్డి గారు స్వయంగా 5 నెలల క్రితం వెంటనే ఇస్తామని గీత కార్మికుల బహిరంగ సభలో చెప్పిన విషయం గుర్తు చేయడం జరిగింది. నెక్లెస్ రోడ్ లోని నీరా కేఫ్, నందనంలోని నీరా ప్రాజెక్ట్ టాడి కార్పొరేషన్ స్వాధీనం చేసుకొని వాటిని విజయవంతంగా నడపాలని తద్వారా గీత కార్మికుల ఉపాధి మెరుగుపరచాలని కోరడం జరిగింది. వృత్తిలో ప్రమాదం జరిగిన వారికి టాడి కార్పొరేషన్ నుండి ఇవ్వాల్సిన ఆర్థిక సహాయం వెంటనే ఇవ్వాలని, ఏజెన్సీ ఏరియా లోని సొసైటీలను పునరుద్ధరించాలని, సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని మరియు ఇటీవల జరిగిన సంఘం రాష్ట్ర సదస్సులో చేసిన 22 అంశాలతో కూడిన తీర్మానాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ సేఫ్టీ కిట్లులు అందరికీ ఇస్తామని, పెండింగ్ ఎక్స్ గ్రేషియా డబ్బులు త్వరలో వచ్చేలా చూస్తామని మిగతా అంశాలు పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

## కాంగ్రెస్ పాలనపై అప్పుడే బోర్

మొదటిపేజీ తరువాయి..

బోసిపోతోంది తెలంగాణ భవన్ నిత్యం కళకళలాడుతోంది. లగచర్ల గిరిజన ఆడబిడ్డలు అందరూ వచ్చి తమ కుటుంబ సభ్యులను జైలు నుంచి విడిపించాలని కోరారు. వారి విడుదల కోసం లీగల్ సెల్ బృందం కష్టపడి న్యాయ పోరాటం చేస్తున్నారు. గిరిజన రైతులను బయటకు తీసుకొస్తామని ధైర్యం చెప్పాను. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు కూడా ఫిర్యాదులు చేశాం. ఇక మా బకాయిలు ఇప్పించాలని మాజీ సర్పంచ్‌లు అడిగారు. ఆశా వర్కర్లు మా గురించి అసెంబ్లీలో మాట్లాడాలని కోరుతున్నారు. ఈ ఒక్కరోజే అందరూ తెలంగాణ భవన్‌కు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారని కేటీఆర్ తెలిపారు. సూటిగా, సుత్తి లేకుండా సామాన్యుడికి అర్థమయ్యే విధంగా నమ్మి నానబోస్తే షార్ట్ ఫిల్మ్‌లో స్పష్టంగా చెప్పారు. గుండెకు తట్టే విధంగా చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు రగిలిపోతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలను లేవనెత్తుతాం. ప్రజల తరపున ప్రభుత్వంపై తప్పకుండా పోరాటం చేస్తాం. మనకు అధికారం మాత్రమే పోయింది.. పోరాట యావ, చేవ పోలేదు. ప్రజల్లో అభిమానం ఏ మాత్రం తగ్గలేదు.. పెరిగింది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

### నైట్ ఔట్ కోసం వెళ్తూ

## ఐదుగురి దుర్మరణం

మొదటిపేజీ తరువాయి..

అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు బతికి బయటపడ్డారు. ఈ ప్రమాద ఘటనలో మృతులు హైదరాబాద్ ఎల్ బి నగర్ కు చెందిన హర్ష, దినేష్, బాలు, వినయ్,వంశీ లు మృతి చెందారు.మణికంఠ అనే వ్యక్తి ప్రమాద సంఘటన నుంచి బయట పడ్డాడు. అయితే ప్రమాదం నుంచి బయట పడిన మణికంఠ సమాచారం ప్రకారం నైట్ అవుట్ కోసం తాము వలిగొండ కు వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ప్రమాదం లో మృతి చెందిన వ్యక్తుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రం భువనగిరి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. కాగా మృతి చెందిన వారి కుటుంబాలల్లో తీవ్ర విషాదం నెలకొంది.చెరువు లో మునిగిన కారు ను జెసిబి సహాయంతో బయటకు తీశారు. అయితే ప్రమాదం జరిగిన విషయం తెలిసి స్థానికులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అయితే ప్రమాదవిషయం జిల్లా మొత్తాన్ని కలచివేసింది.



ప్రమాదం నుంచి బయటపడిన మణికంఠ

## తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రావాలి

మొదటిపేజీ తరువాయి..

ఆ మేరకు ఆయన ఫార్మ్‌హౌస్‌కు వెళ్లిన పొన్నం, ఆహ్వానపత్రిక అందించారు. ఆయనతో కలసి భోజనం చేశారు. ప్రభుత్వ పక్షాన ఉదయం గవర్నర్‌ని కలిసి 9 వ తేది తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కు రావాలని ఆహ్వానించాం. తర్వాత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించా. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని కలిసి నాతో పాటు మా ప్రోటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్ ,ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు ని కలిసి అహ్వానించాం. ప్రభుత్వ పక్షాన మర్యాదగా అందరినీ గౌరవించుకుంటాం. విగ్రహ ఏర్పాటు పై ఎలాంటి చర్చ జరగలేదు. రాజకీయాలు వేరు. ఆహ్వానించాం. వారు ప్రతిపక్ష నాయకులుగా, హైదరాబాద్ ఇన్చార్జి మంత్రిగా ఆహ్వానించా. భోజన సమయంలో రావడం వల్ల వారి ఆహ్వానం మేరకు భోజనం చేశాం.

## యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని జాతికి అంకితం చేసిన ముఖ్యమంత్రి

మొదటిపేజీ తరువాయి..

యూనిట్-2 వద్ద పూజలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను వారు తిలకించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ,తుమ్మల నాగేశ్వర రావు,కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎంపీలు రఘువీర్ రెడ్డి,చామల కిరణ్ కుమార్ రెడ్డి లతో పాటుగా నల్గొండ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# అర్బన్ నక్సల్స్ చేతిలో రేవంత్ సర్కార్ బందీ

మొదటిపేజీ తరువాయి..

బండి సంజయ్ ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలను తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. ఏమన్నారంటే...

బీజేపీ చల్లబడిందని ప్రచారం చేసే వాళ్ల చెంప చెళ్లుమన్పించండి. బీఆర్ఎస్ తూట్ పాలిష్ నాయకుల లెక్క బీజేపీ కార్యకర్తలుండరు. బీఆర్ఎస్ కార్యకర్తలు, క్యాడర్ బయటకు రావడం లేదు. బీజేపీ కార్యకర్తలు ఫైర్ బ్రాండ్స్..

ఇగ కాంగ్రెస్ సంగతి చెప్పనక్కర్లేదు. రేవంత్ రెడ్డి ఎన్నడైనా ప్రజా సమస్యలపై పోరాడిండా? రైతుల కోసం, మహిళల కోసం, నిరుద్యోగుల కోసం కొట్లాడిండా? వాళ్ల కోసం ఎన్నడైనా జైళ్లకు పోయిండా? మహా అంటే ఓటుకు నోటు కేసు తప్ప ఆయనపై ఉన్న కేసులేంది? కానీ బీజేపీ కార్యకర్తలు ఏనాడూ కాషాయ జెండా వీడలేదు. పోరాటాలను ఆపలేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తెలంగాణలో వికసించేది కమలమే. ఒక సెక్షన్ మీడియా, టీవీ ఛానళ్లు రేవంత్ రెడ్డి పక్షాన ఉన్నాయని, ఏదో సొంత డబ్బా కొంటుకున్నరు. ఏ సర్వే చూసినా కాంగ్రెస్ ది మూడవ స్థానమే.

రేవంత్ రెడ్డి భాష, నడవడిక చూసి జనం నవ్వుకుంటున్నారు. సీఎంగా గుర్తించడం లేదు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయలే. ఏమైనా అంటే ఫ్రీ బస్సు, ఫ్రీ గ్యాస్, ఫ్రీ కరెంట్ అని కోతలు పెట్టడం తప్ప ఆయన సాధించిందేమిటి? ఈ వేదిక సాక్షిగా మేం అడిగే ప్రశ్నలకు మీరు సమాధానం చెప్పండి. ఇంకా 22 లక్షల మంది రైతులకు రుణమాఫీ అమలు చేయనిది నిజమా? కాదా? వ్యవసాయ మంత్రే ఇది నిజమని ఒప్పుకున్నది వాస్తవం కాదా? రైతులకు ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని ఎగ్గొట్టింది నిజం కాదా? తాలు, తరుగు, తేమతో పనిలేకుండా వడ్లు కొంటామని మాట తప్పింది నిజం కాదా? బోనస్ పేరుతో రైతులను వంచించింది మీరు కాదా?

మహిళలకు తులం బంగారం, స్కూటీ ఇస్తామన్నరు. కోడలకు రూ.2500లు, అత్తామామలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామన్నరు. ఎంతమందికి ఇచ్చారో చెప్పే దమ్ముందా? యూత్ డిక్లరేషన్ పేరుతో 2 లక్షల ఉద్యోగాలను ఏడాదిలో భర్తీ చేస్తామన్నరు. రేవంత్ నోరు తెరిస్తే పచ్చి అబద్దాలాడుతున్నరు. టీఎస్పీఎస్సీ ఛైర్మన్ మహేందర్ రెడ్డి సాక్షాత్తు 13 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చాం... 12 వేలు మాత్రమే భర్తీ చేస్తామన్నడు. అవిగాక డీఎస్సీ పేరుతో మరో 10 వేల ఉద్యోగాలను భర్తీ చేశారు. మహా అంటే 25 వేలకు మించి ఉద్యోగాలను భర్తీ చేయని మీరు... 55 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఎట్లా చెప్పుకుంటారు. నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. ఒక్కో నిరుద్యోగికి రూ.4వేల భృతి ఇస్తానన్నడు. ఏడాది కాలంగా ఒక్కో నిరుద్యోగ తమ్ముడికి రూ.48 వేల బాకీ పడ్డడు.

కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు... ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నరు. 6,500 మంది పార్ట్ టైం లెక్చరర్లను నిర్దాక్షిణ్యంగా తొలగించిన దుర్మార్గుడు. రేవంత్ మూర?త్వంవల్ల నిరుద్యోగుల బతుకులు సర్వనాశనమైనయ్. కోచింగ్ తీసుకోవడానికి కూడా ముందుకు రావడం లేదు. ఇగ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్ ఇవ్వడం లేదు. రూ.7 వేల కోట్ల ఫీజు బకాయిలు పెట్టిండు. ప్రభుత్వ పాఠశాలల్లో చాక్ పీసులు కొనే పరిస్థితి లేదు. కనీస సౌకర్యాల్లేక మూత పడుతున్నాయి. గురుకులాల్లో పురుగుల అన్నం, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని దుస్థితి. ఉద్యోగులకు 4 డీఏలివ్వకుండా మోసం చేసిండు. 317 జీవోను సవరించకుండా ఉద్యోగులను చెట్టుకొకరు పుట్టకొకరుగా మారారు. కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీంను అమలు



చేయలేదు. ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వడం లేదు.

అన్ని కులాలను వంచిన ఘనత రేవంత్ రెడ్డి సర్కార్ దే. ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తానని మోసం చేసిండు. ఒక్కో తండాకు ఏటా రూ.25 లక్షలిస్తానని మాట తప్పిండు. బీసీ డిక్లరేషన్ పేరుతో ఏటా బీసీ బడ్జెట్ ను రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తానని రాహుల్ గాంధీ చేసిన ప్రకటనను కూడా అమలు చేయలేదు. మాజీ సర్పంచులను అరిగోస పెడుతున్నరు. పెండింగ్ బిల్లులివ్వకుండా రోడ్డున పడేసింది వాస్తవం కాదా? మాజీ సర్పంచుల బతుకులను నాశనం చేయడానికి ప్రధాన కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే...

త్వరలోనే జీహెచ్ఎంసీ ఎన్నికలు రాబోతున్నయ్... ఎట్టి పరిస్థితుల్లో హైదరాబాద్ గడ్డపై కాషాయ జెండాను రెపరెపలాడించడం తథ్యం. భాగ్యనగర్ ప్రజాలారా.. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడిపై దాడిని, చాంద్రాయణగుట్ట రక్షాపురం అమ్మవారి ఆలయంపై, శంషాబాద్ లోని నవగ్రహాలపై జరిగిన దాడిని ప్రజలు మర్చిపోరు. పోయిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి 48 సీట్లు ఇచ్చారు. ఈసారి మేయర్ పీఠం బీజేపీదే. హైదరాబాద్ ఒవైసీ జాగీరనుకుంటున్నరా? ఒక వర్గానికి కొమ్ముకాస్తుంటే చూస్తూ ఊరుకుందామా? బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులు చేస్తున్నరు. అట్లాగే భాగ్యనగర్ లో హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో భాగ్యనగర్ ను బంగ్లాదేశ్ గా మార్చే కుట్ర జరుగుతోంది. ఆ కుట్రలను తిప్పికొడదాం....

బిడ్డా రేవంత్ రెడ్డి... మీకు సంక్రాంతి డెడ్ లైన్. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడిని గల్లీలో తిరగనీయం. రైతులతోసహా ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత నీదే. మోదీ తెలంగాణకు ఏం నిధులిచ్చిండని ఎదురుదాడి చేస్తున్నడు. మోదీ పైసలన్నీ మూట కట్టుకుని వచ్చి ఇస్తడా? తెలంగాణలో జరిగే ప్రతి అభివృద్ధి పనులకు నిధులిస్తోంది కేంద్రం కాదా? గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనులకు నిధులిస్తోంది నరేంద్రమోదీ ప్రభుత్వం కాదా? మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు నిధులిస్తోంది కేంద్రం కాదా? చివరకు రేషన్ బియ్యం, వడ్ల కొనుగోలు పైసలన్నీ మోదీ ప్రభుత్వం ఇస్తోంది నిజం కాదా? అయినా ప్రధాని ఫోటో పెట్టకుండా ఇందిరమ్మ, సోనియమ్మ పేరుతో రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నడు. ఏడాదిలో పేదలందరికీ ఇండ్లు కట్టిస్తానన్నడు. ఒక్క ఇల్లు అయినా కట్టించారా? నరేంద్రమోదీ ప్రభుత్వం లక్షల ఇండ్లు మంజూరు చేస్తే ఆ నిధులను ఆనాడు బీఆర్ఎస్ సర్కార్ దారి మళ్లిస్తే...ఈనాడు ముగ్గు పోసి ఇల్లు కట్టకుండా మోసం చేస్తున్న ఘనత కాంగ్రెస్ దే. రాష్ట్రంలో నిర్మించే ఇండ్లకు నిధులిస్తున్నది నరేంద్రమోదీ ప్రభుత్వం అనే విషయాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయండి.

అర్బన్ నక్సల్స్ చేతిలో కీలుబొమ్మగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం బందీగా మారింది. మంత్రివర్గంలో మాజీ నక్సల్స్ ఉన్నరు. విద్యా కమిషన్ లో నక్సల్ భావ జాలమున్నవాళ్లను నియమించండి. రాబోయే రోజుల్లో తెలంగాణ యువతను నక్సల్స్ గా మార్చే కుట్ర చేస్తున్నారు... తెలంగాణ ప్రజాలారా.... స్వామి వివేకానందగా, అంబేద్కర్ గా, మహాత్మాజ్యోతిరావు పూలే, కొమరం భీం కావాలనుకుంటున్నారా?... నక్సల్స్ గా మారాలనుకుంటున్నారా? ఆలోచించండి.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే. ఇద్దరూ కుమ్మక్కయ్యారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగితే కాంప్రమైజ్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తే అరెస్టుల్లేవు? ఈ ఫార్ములా కార్ల రేసులో స్కాం జరిగితే చర్యల్లేవు. గొర్రెల, బర్రెల స్కాం జరిగితే చర్యల్లేవు. రాష్ట్రంలో ఆర్కే పాలన కొనసాగుతోంది(రేవంత్ రెడ్డి, కేసీఆర్). ఈ రెండు కుటుంబాల మధ్య రాజకీయ, వ్యాపార లావాదేవీలు నడుస్తున్నాయి. ఆ లావాదేవీలను బయట పెట్టేందుకు మేం సిద్ధం. ఈ రెండు పార్టీల కుమ్మక్కు రాజకీయాలు తెలిసే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారు. 8 ఎంపీ సీట్లు గెలిపించారు. కాంగ్రెస్ పార్టీకి సంక్రాంతి వరకు డెడ్ లైన్. ఆ తరువాత హామీలను అమలు చేసేదాకా గ్రామాల్లో తిరగనీయం. కాంగ్రెస్ ఎన్ని హామీలను నెరవేర్చిందో బహిరంగ చర్చకు, పాదయాత్రకు సిద్ధమా?

## కాంగ్రెస్ అంటేనే ఏమార్చడం

మొదటిపేజీ తరువాయి..

పెట్టిస్తున్నారని బాధను వెలిబుచ్చారు. భూసేకరణ చట్టం అమలు చేయకుండా, తక్కువ ధరకే భూములు లాక్కునే కుట్ర చేస్తున్నారని వివరించారు. తమ సమస్య పట్ల ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల హామీలో చెప్పిన విధంగా కాంగ్రెస్ మాట నిలుపుకునే వరకు బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'ఉత్తర దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలని ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బాధితులకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ చేత హామీ ఇప్పించి ఇప్పుడు మాట మార్చడం దుర్మార్గం. ఆర్ఆర్ఆర్ ఏర్పాటు విషయంలో ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు బదులుగా 28 కిలో మీటర్లను పరిగణనలోకి తీసుకోవడం వల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పట్టణం మధ్య నుంచి రోడ్డు వెళ్లడంతో మున్సిపాలిటీ రెండు భాగాలుగా విడిపోతున్నది. బాధితులు రెండు పంటలు పండించే పచ్చని పొలాలను, ఇండ్లు, ప్లాట్లను కోల్పోతున్నా ప్రభుత్వం కనికరించడం లేదు. చౌటుప్పల్ వద్ద జంక్షన్ రింగు గతంలో 78 ఎకరాల్లో ఉంటే ఇప్పుడు 184 కు పెంచడం వల్ల పేదల భూములు, ప్లాట్లు కోల్పోతున్నారు. దీనికిగాను నష్టపరిహారం కూడా తక్కువ చెల్లిస్తున్నారు. ఎంపీగా ఉన్నప్పుడు కోమటి రెడ్డి.. బాధితులతో కలిసి ఆర్ఆర్ఆర్‌ను మార్చాలని, రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంలోనూ అలైన్‌మెంట్ మార్చుతామని హామీలు ఇచ్చారు. కానీ, ఇప్పుడేమో అదే పోలీసు బలగాలతో, నిర్బంధంగా రోడ్డుకు 28 కిలోమీటర్ల పరిధిలోనే సర్వే చేయించి, ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టాలని బలవంత పెట్టడం దుర్మార్గం. రైతులను కాదని సర్వేలు నిర్వహించడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయడం. నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చి పచ్చటి పొలాల్లో చిచ్చు బెడుతున్నారు. గిరిజనుల బిడ్డలను జైళ్ల పాలు చేశారు. నాడు ట్రిపుల్ ఆర్ రోడ్డు అలైన్మెంట్ మార్పు అన్నారు నేడు మాట మార్చి, నిర్బంధాల మధ్య భూసేకరణ కొనసాగిస్తున్నారు. రేవంత్ రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్ పద్దతా?. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రియాంక గాంధీతో.. ఆర్ఆర్ఆర్ భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పించారు.

కానీ, అధికారంలోకి రాగానే బాధితుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తూ తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. వేధిస్తూ దాడులకుదిగుతున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి హామీ అమలు చేయండి. లేదంటే బాధితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# కేసీఆర్ ఏనాడైనా ప్రతిపక్ష పాత్రను పోషించారా?

మొదటిపేజీ తరువాయి..

ఎంపీగా గెలిచానన్నారు. కానీ కేసీఆర్ ఒక్కసారి ఓడిపోతే కుంగిపోయి ఫాంహౌస్‌లోకి వెళ్లారని ఎద్దేవా చేశారు. నల్గొండలో నిర్వహించిన కాంగ్రెస్ విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ గాలి బ్యాచ్‌ను తమ పైకి వదిలి వెళ్లారని మండిపడ్డారు. ప్రభుత్వం ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా వద్దంటున్నారని, అలా చేస్తే తెలంగాణ ముందుకు ఎలా వెళుతుందని ప్రశ్నించారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా నిధులు వేస్తామని... రైతుల ఖాతాల్లో డబ్బులు పడుతుంటే బీఆర్ఎస్ నేతల గుండెలు లబ్‌డబ్ అంటూ కొట్టుకోవాలన్నారు. రైతులు సన్నాలు పండించాలని విజ్ఞప్తి చేశారు. ఎయిర్ పోర్టుకు కూతవేటు దూరంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మూసీ ప్రక్షాళన చేస్తానంటే బీఆర్ఎస్ నాయకులు వద్దంటున్నారని, కానీ అనుభవం కలిగిన కేసీఆర్ ఈ అంశంపై తన వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రక్షాళన వద్దంటే బొంద పెడతారని హెచ్చరించారు. బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్‌కు తాను ఒక్కటే మాట చెబుతున్నానని, మీరు మారాలని, ఆలోచన చేయాలని సూచించారు. ఆ దొంగల దోస్తీ చేస్తే... ఆ దొంగల మాటలు పట్టుకుంటే మీరు కూడా అలాగే తయారవుతారన్నారు. మీరు దొంగల బండి ఎక్కితే మీపై ఉన్న గౌరవం కూడా పోతుందన్నారు. ఏడాది పాలనలోనే తాము రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, ప్రధాని మోదీ కానీ, కేసీఆర్ కానీ అలా చేశారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో నల్గొండ పాత్ర మరువలేనిదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతచారి నల్గొండ జిల్లాకు చెందిన వాడేనన్నారు. నల్గొండలో అడుగుపెట్టినప్పుడు సాయుధ రైతాంగ పోరాటం గుర్తుకువస్తుందన్నారు. నల్గొండలో కృష్ణాజలాలు ప్రవహిస్తే ఫ్లోరైడ్ సమస్య తీరుతుందని ప్రజలు భావించారన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులు కేసీఆర్ హయాంలో నిలిచిపోయాయని విమర్శించారు.ఉమ్మడి ఏపీ పాలనలో కంటే కేసీఆర్ పాలనలోనే నల్గొండకు ఎక్కువ అన్యాయం జరిగిందని మండిపడ్డారు. నల్గొండకు కృష్ణా జలాలు తీసుకొచ్చి నేలను



సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

వరి వేస్తే ఉరేసుకున్నట్లేనని కేసీఆర్ గతంలో అన్నారని, కానీ తాము మాత్రం మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇచ్చామన్నారు. మూడ్రోజుల్లోనే రైతులకు ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. అత్యధిక ధాన్యాన్ని ఉత్పత్తి చేసి తెలంగాణ రికార్డ్ సృష్టించిందన్నారు. నల్గొండ జిల్లా భూముల్ని తడిపేందుకు కృష్ణమ్మ బిరబిరా తరలివచ్చే తరుణం ఆసన్నమైంది. 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత.. నార్కట్‌పల్లిలోని బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి సిద్ధమైంది. నల్గొండ జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్ట్‌ని.. సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదాద్రి థర్మల్ స్టేషన్ లోని 800 మెగా వాట్ల యూనిట్ -2 ను ప్రారంభించి జాతికి అంకితం ఇచ్చారు. ఈ నేపథ్యంలో అక్కడి ఫోటో ప్రదర్శనను తిలకించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం రేవంత్ భట్టి విక్రమార్క, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎంపీ రఘువీర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నరు. నల్గొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగు నీరందించడమే కాదు.. 107 గ్రామాలకు తాగునీరందించే ఈ ప్రాజెక్ట్‌కి.. ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తయింది. 2 మోటార్ల ద్వారా రిజర్వాయర్‌లో 70 శాతం నీటిని నింపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్ట్‌ని ప్రారంభించడంతో పాటు రిజర్వాయర్ దగ్గర ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా 500 కోట్ల వ్యయంతో కాలువ పనులు, మిగిలిన పెండింగ్ పనులు పూర్తి చేయనున్నట్లు.. ఇప్పటికే మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. నల్గొండ శివారులోని పానగల్‌లో ఉన్న ఉదయసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి.. 0.3 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న బ్రాహ్మణవెల్లెం రిజర్వాయర్‌లో నీటిని నింపుతారు. పానగల్ నుంచి 7 కిలోమీటర్ల ఓపెన్ కాలువ, కట్టంగూరు మండలంలోని పిట్టంపల్లి దగ్గరున్న సొరంగ మార్గం నుంచి నీటిని తరలిస్తారు. బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్ట్ నుంచి కుడి, ఎడమ కాలువలు తవ్వి.. నల్గొండ, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో.. లక్ష ఎకరాలకు సాగు నీరు అందిస్తారు. సుమారు 7 వందల కోట్ల అంచనా వ్యయంలో.. దాదాపు 484 కోట్లు ప్రాజెక్ట్ నిర్మాణానికి, మిగిలిన మొత్తాన్ని భూసేకరణకు కేటాయించారు.

### నిబంధనల ప్రకారం

## కోడెల పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

భక్తులు సమర్పించిన కోడెల సంఖ్య పెరుగుతుండటంతో కోడెల నిర్వహణ భారంగా మారి చాలా కోడెలు మరణించిన విషయాన్ని మంత్రి కొండా సురేఖ గుర్తు చేశారు. ఈ క్రమంలో భక్తుల విన్నపాల మేరకు మొక్కుల రూపంలో భక్తులు సమర్పించిన కోడెల నిర్వహణ నిమిత్తం విధివిధానాలను రూపొందించేందుకు ఆరు నెలల క్రితం మే నెలలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, వేములవాడ ఆలయ ఈవో కన్వీనర్ గా, పలువురు ఇతర సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటి మార్గదర్శకాలను రూపొందించినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఈ మేరకు జీవో విడుదల చేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ఈ మార్గదర్శకాల ప్రకారం పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, సంబంధిత మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ధృవీకరణ పత్రం వుంటేనే పంపిణీ చేస్తున్నట్లు మంత్రి సురేఖ గుర్తు చేశారు. ధ్రువీకరణ పత్రాలు నిబంధనలకు అనుగుణంగా వుంటేనే ఒక రైతుకు రెండు కోడెల చొప్పున మాత్రమే ఇస్తున్న విషయాన్ని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కోడెల సంరక్షణ కోసం గోశాలలో సిసి ఫ్లోరింగ్, సరిపడా షెడ్లు, తాగునీటి వసతి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మంత్రి సురేఖ వివరించారు. మూగజీవాల పై తమ ప్రభుత్వానికున్న శ్రద్ధ అటువంటిది అన్నారు. ఎంతో నిబద్ధతతో గోశాలల నిర్వహణ, గోవుల సంరక్షణను చేపడుతున్న పరిస్థితుల్లో కోడెలను అక్రమంగా విక్రయించారని వచ్చిన వదంతులను మంత్రి కొండా సురేఖ కొట్టి పారేశారు. సాధారణంగా తన వద్దకు వచ్చే దరఖాస్తులను పరిశీలించాలని సంబంధింత అధికారులకు సూచిస్తుంటామని, కోడెల పంపిణీకి సంబంధించి వచ్చిన దరఖాస్తులను అదే విధంగా పంపించామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దేవస్థానం అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే రైతులకు కోడెలను పంపిణీ చేసారని మంత్రి పునరుద్ఘాటించారు. ఇందులో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరగలేదని మంత్రి కొండా సురేఖ తేల్చి చెప్పారు. వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానంలోని ప్రతి కోడెకు శాశ్వతమైన ట్యాగ్ వుంటుందని, అటువంటి ట్యాగ్ లున్న కోడెలు ఎక్కడా పట్టుబడలేదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

ఈ వ్యవహారానికి సంబంధించి నిజానిజాలను వెల్లడిస్తూ నిన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఈవో స్పష్టతనిచ్చిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నదని అవాస్తవ ప్రచారం చేస్తూ, సమాజంలో అశాంతిని సృష్టించే అసాంఘిక శక్తులను వెలికితీసి, చట్టపరంగా చర్యలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## జైలుకు వెళ్లే తొందరలో కెటిఆర్

మొదటిపేజీ తరువాయి..

మళ్లీ అధికారంలోకి వచ్చేది లేదన్నారు. రాజీవ్ గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాలను మార్చేది లేదన్నారు. విగ్రహాలు ఉండాల్సిన చోటనే ఉన్నాయన్నారు.

రైతులను యువకులను బీఆర్ఎస్ మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు రుణమాఫీ చేశామని, యువకులకు 57 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఏడాది పాలనలో తాము చెప్పని హామీలు కూడా నెరవేర్చామన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



## పాలకుర్తిలో కాలం చెల్లిన
# మందుల పంపిణీ

**ఆందోళన చెందుతున్న హాస్టల్ విద్యార్థులు**

**ఎంఎల్ఏ ఊరిలోనే సంఘటన**

**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 7:** గురుకులంలో విద్యార్థులకు కాలం చెల్లిన మందులను సరఫరా చేసిన వైనం పాలకుర్తి లో వెలుగు చూసింది, కాగా ఈ సంఘటన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సొంత ఊరిలోనే ఘటన చోటు చేసుకోవడం కలకలం రేపుతోంది. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని చెర్ల పాలెం సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో కాలం చెల్లిన మందులు ఇచ్చిన వైద్య సిబ్బంది దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, పాలకుర్తి బాలుర వసతి గృహంలో మెడికల్ క్యాంప్



నిర్వహించి కాలం చెల్లిన మందులు ఇచ్చారని చెప్తున్న వసతి గృహం అటెండర్ చెప్పుతుండు ఐతే ఒక వైపు ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతుంటే మరో వైపు డేట్ అయిపోయిన మందులు ఇస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు, అలాగే విద్యార్థులు ఆందోళన బాట పట్టకుండా జాగ్రత్త పడాలని అధికారులకు సూచించారు.



# గోమాతను రక్షించుకుంటే మనల్ని మనం రక్షించుకున్నట్టే

**- ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 07:** గోమాత ను రక్షించుకుంటే మనల్ని మనం రక్షించుకున్నట్టేనని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బాలక్రిష్ణ స్వామి గో సంరక్షణ పాదయాత్రను చేపట్టారు. కాగా శనివారం పాదయాత్ర ఆదిలాబాద్ లోని గోపాల కృష్ణ మఠానికి రాగా ఎమ్మెల్యే తో పాటు తదితరులు స్వాగతం పలికారు. ముందుగా గోమాతకు పూజలు చేశారు. అనంతరం బాలక్రిష్ణ స్వామిని సత్కరించారు. మఠాధిపతి యోగానంద సరస్వతి, సమర సత వేధిక తెలంగాణ ప్రాంత నాయకులు అప్పాల ప్రసాద్ తదితరులున్నారు.



## 22 నుంచి 85వ విశ్వశాంతి
# మహా యాగా మహోత్సవం

**ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 07:**

శ్రీ వైష్ణవ ఆయుక్త చండీ అతిరుద్రం శ్రీ సీతారామ సామ్రాజ పట్టాభిషేకం 85వ విశ్వశాంతి మహా యాగా మహోత్సవాన్ని ఈనెల 22.12.24 నుంచి తేదీ 06.01..25 వరకు నిర్వహించే యాగంలో శ్రీశ్రీ శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూప నందా స్వామిచే మహా యాగం నిర్వహించడం జరుగుతుంది. శనివారం రోజున డైట్ గ్రౌండ్ మైదానంలో భూమి పూజ చేయడం జరిగింది.

# క్రీడల్లో పాల్గొనడమే ముఖ్యం

**నేను ఐ ఏ ఎస్ కాకుంటే క్రీడాకారుడి అయ్యే వాడిన్ని**

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి**

**(రాపర్తి భాస్కర్ గౌడ్)**

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 7:** క్రీడాలలో గెలుపోటములు ముఖ్యం కాదు. పాల్గొనడమే ముఖ్యమని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు.నేను క్రీడాకారుణ్ణే నేను చిన్నప్పటి నుండి క్రీడాల్లో పాల్గొనేవాన్ని. ఐఏఎస్ కాకుంటే క్రీడాకారుణ్ణి అయ్యేవాన్నారు. ఇలాంటి క్రీడావేదికల్లో ఇతర ప్రాంతాల క్రీడాకారులతో పోటీ పడడంతో క్రీడాస్ఫూర్తి పెరుగుతుందని మను చౌదరి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలనుండి వచ్చిన క్రీడాకారులు 4 రోజుల నుండి యాక్టీవ్ గా, క్రమశిక్షణతో పాల్గొన్నారని కలెక్టర్ తెలిపారు,చదువుతో పాటు క్రీడలు, ఇతర కళలలో



ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులు ఆయా రంగాలలో ప్రోత్సాహించాలని కోరారు,జీవితంలో పెద్ద పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు ఇప్పటినుండే క్రమబద్దంగా కృషిచేస్తే భవిష్యత్‌లో ఉన్నంతంగా ఎదుగుతారని మను చౌదరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.







## ఉదయసముద్రం ప్రాజెక్ట్ పైలాన్‌ను
# ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

**- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**(రాపర్తి భాస్కర్ గౌడ్)**

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో,డిసెంబర్ 7:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శని వారం నల్గొండ జిల్లా నార్కట్ పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామశివారులో ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించారు. అలాగే, ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టులో కీలకమైన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిని విడుదల చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇతర మంత్రులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహలతో పాటు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# "పాలమూరు వీర...రేవంత్ రెడ్డి" పాట ఆవిష్కరణ

**అసెంబ్లీ ఆవరణలో విడుదల చేసిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

**నిర్మాత రాచాలను అభినందించిన ఎమ్మెల్సీ**

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 07:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్త యిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై "పాలమూరు వీర" అనే పాటను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శనివారం అసెంబ్లీ ఆవరణలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రముఖ నిర్మాత రాచాల యుగంధర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో కవి,రచయిత రేలారే ప్రసాద్ రచించిన "పాలమూరు వీర" అనే గీతం అద్భుతంగా ఉందని, రేవంత్ ఒక్కడిగా ఎదిగివచ్చిన విధానం పార్టీని అధికారంలోకి తీసుకురావడమే కాకుండా ముఖ్యమంత్రిగా ఎదిగిన విధానం గురించి చాలా గొప్పగా చెప్పారని తెలిపారు.






అదేవిధంగా అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపు పూర్తి చేసిన పథకాలు, ఉద్యోగాలు మరియు అభివృద్ధి గురించి కూడా ఇందులో చక్కగా పొందు పరిచారు అని కొనియాడారు

ఈ పాట నిర్మాత రాచాల యుగంధర్ గౌడుని, రచన చేసిన రేలా రే ప్రసాద్ ను, సంగీతం అందించిన కళ్యాణ్ కీస్ మరియు గాయకుడు ఏంఎల్ఆర్ కార్తికేయను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గాలిగల్ల సాయిబాబా, నవీన్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.





## అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో
# హామీలను విస్మరించి అభివృద్ధిని గాలికి వదిలేసింది

**ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా కల్లబొల్లి మాటలతో కమిటీల పేరుతో కాలయాపన చేస్తుంది : ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్, వెలుతురు డిసెంబర్ 07:**

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలను విస్మరించి అభివృద్ధిని గాలికి వదిలేసిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా కల్లబొల్లి మాటలతో కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని ఆయన అన్నారు

గత ప్రభుత్వం 7 లక్షల కోట్లు అప్పులు చేస్తే ఈ ప్రభుత్వం మరో ఏడు లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చే యోజనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు పండించిన ప్రతి పంటకు బోనసిస్తామని చెప్పిన ప్రభుత్వం కేవలం వరి పంటకిచ్చి మిగిలిన పంటలకు బోనస్ ఇవ్వడం లేదని ఆయన అన్నారు 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం రెండు లక్షల పైన రుణం తీసుకున్న రైతులను విస్మరించిందని ఆయన అన్నారు గత ప్రభుత్వం పంట బీమా జోలికి పోకుండా రైతులు నట్టేట ముంచితే ఈ ప్రభుత్వం మేమే బీమా ప్రీమియం కడతామని చెప్పి ఏడాది గడిచిన పంట బీమా అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు.

అధికారంలోకి రాగానే రైతుబంధును పెంపు చేసి రైతు భరోసా పేరిట ఎకరానికి 15000 ఇస్తామని చెప్పి ఏడాది గడిచిన ఇంకా కమిటీల పేరుతో ప్రజలను మభ్యపెడుతుందని ఆయన అన్నారు ప్రతి మహిళకు రూపాయలు 2500 ఇస్తామని చెప్పిన ప్రభుత్వాన్ని ఏమైందని అడిగితే సబ్ కమిటీ వేశాము ఇస్తామని మభ్యపెడుతుందని ఆయన అన్నారు ఇందిరమ్మ ఇండ్లు కాగితాలకే పరిమితమయ్యాయని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్లనే ఇందిరమ్మ ఇండ్లుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానద్. వేణుగోపాల్ ఆకుల ప్రవీణ్ జోగు రవి, మయూర్ చంద్ర విజయ్ జ్యోతి రఘుపతి . దినేష్ మటాలియ. గ౦గారెడ్డి.నగేష్. అశోక్ రెడ్డి శ్రీనివాస్ కృష్ణ యాదవ్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు ప్రజల్లో సంతోషం

**- మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి**

**కూకట్‌పల్లి, డిసెంబర్ 7 వెలుతురు:** కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో నేడు ప్రజలు ఎంతో సంతోషంగా జీవనం గడుపుతున్నారని కూకట్‌పల్లి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఏ. బ్లాకు ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు.

శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి నేటికీ సంవత్సరం కావస్తున్న సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆదేశానుసారం నియోజక వర్గంలోని బాలానగర్ డివిజన్‌లోని ఇంద్రానగర్, ఎన్టీఆర్ నగర్, శ్రీశ్రీనగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్



నేతలు, కార్యకర్తలు ఇంటింటికి విస్తృతంగా తిరిగి కాంగ్రెస్ పథకాలను ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సంవత్సరం క్రితం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు పరుస్తూ ప్రజల ఆదరాభిమానా లను పొందు తుందన్నారు.

ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం లాంటి సంక్షేమ పథకాలు ప్రజల్లో ఎంతో ఆదరాభిమా నాలు పొందుతున్నాయని గర్వంగా చెప్పుకుంటున్నా మని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, గజానంద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఆత్మహత్యల బాట పడుతున్న అన్నదాతలు

సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఇటీవల సమర్పించిన మధ్యంతర నివేదిక దేశం లో నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని కళ్ళకు కట్టినట్టు చూపింది. సమస్యల వలయంలో చిక్కుకున్న అన్నదాతలు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యల బాట పడుతున్న తీరును ఈ నివేదిక సోదా హరణంగా వివరించింది. అన్నదాతలే గోస తీస్తుంటే వారి మీద ఆధారపడ్డ వ్యవసాయ కార్మికుల కుటుంబాల పరిస్థితి ఎలా బావుంటుందని ప్రశ్నించింది. దేశ వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మి కుల బలవన్మరణాలు పెరిగిపోతుండటానికి ఇదొక ముఖ్య కారణమని ఆ నివేదిక కుండ బద్దలు కొట్టింది. ఈ పరిస్థితిని తక్షణమే మార్చాలని పేర్కొనడంతో పాటు, దానికి అవసరమైన కనీస చర్యలనూ సూచించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్దత కల్పించడంతో పాటు, దేశ వ్యాప్తంగా తక్షణమే రైతులకు రుణమాఫీ అమలు చేయడం ఈ కమిటీ చేసిన సూచనల్లో అత్యంత కీలకమైనవి. వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను మెరుగుపరచడం, సేంద్రీయ వ్యవసాయాన్ని, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడంతో పాటు వ్యవసాయ కార్మికుల పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఉపాధిహామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని చెప్పింది. ఇంత కీలకమైన ఈ సిఫార్సులకు మీడియాలో పెద్దగా ప్రాధాన్యత లభించకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. గత నెల రెండవ తేదీన పంజాబ్-హర్యానా హైకోర్టుకు చెందిన రిటైర్డ్ న్యాయమూర్తి నవాబ్‌సింగ్ అధ్యక్షతన ఈ ఉన్నత స్థాయి కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. వ్యవసాయ రంగాన్ని అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా నివేదికను సమర్పించాలని ఈ కమిటీని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీం ఆదేశాల మేరకు పక్షం రోజుల్లోనే ప్రాథమిక పరిశీలనను పూర్తిచేసిన ఈ కమిటీ నవంబర్ 21వ తేదీన మధ్యంతర నివేదికను సమర్పించింది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన మూడు దశాబ్దాల దేశ వ్యాప్త నివేదికలు, గణాంకాలను ఈ కమిటీ పరిశీలించింది. పంజాబ్-హర్యానా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి రూపొందించిన ఈ నివేదికలో అనేక షాకింగ్ విషయాలను పేర్కొంది. ముప్పయి సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా నాలుగు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఈ కమిటీ తేల్చింది. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో డేటా ఆధారంగా ఈ నిర్ధారణకు కమిటీ



వచ్చింది. ఇవి అధికారిక లెక్కలే కావడంతో వాస్తవంలో ఈ బలవన్మరణాలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వ్యవసాయం మీదనే ఆధారపడిన రైతులు రోజుకు 27 రూపాయలు మాత్రమే సంపాదిస్తున్నట్లు కమిటీ తేల్చింది. జాతీయ సర్వేతో పాటు నాబార్డు నివేదికలు, గ్రామీణ భారతంలోని వ్యవసాయ కమతాలు, పశుసంపదకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ రికార్డులను పరిశీలించి రైతుల ఆదాయంపై ఈ నిర్ధారణకు వచ్చిన కమిటీ 'ఇంత తక్కువ ఆదాయంతో జీవనాన్ని కొనసాగించడం అసాధ్యం. ఇదే వారిని ఆత్మహత్యల వైపు నడిపిస్తోంది' అని పేర్కొంది. దేశ వ్యాప్తంగా ఉన్న మొత్తం కార్మికుల్లో 46 శాతం మంది ఇప్పటికీ వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నారని, ఆదాయంలో వారి వాటా కేవలం 15 శాతమేనని తెలిపింది. వ్యవసాయ కార్మిక కుటుంబాల్లో నిరుద్యోగులుగా ఉన్న వారు, జీతం లేకుండానే కుటుంబం తరపున రెక్కలు ముక్కలు చేసుకుంటున్న వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉందని కమిటీ పేర్కొనడం గమనార్హం. ఇది ఏదో రూపంలో కొనసాగుతున్న వెట్టిచాకిరీకి నిదర్శనం.మ సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతాంగం దేశ వ్యాప్త ఆందోళనకు తిరిగి సిద్ధమౌతున్న నేపథ్యంలో ఈ నివేదిక వెలువడటం ప్రాధాన్యత నంతరించుకుంది. కొన్ని సంవత్సరాలుగా రైతాంగం ఏదైతే చెబుతుందో దాదాపుగా అవే అంశాలు అంతే తీవ్రతతో ఈ నివేదికలోనూ కనిపించడం క్షేత్రస్థాయిలో నెలకొన్న దుస్థితికి దర్పణం పడుతోంది. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణం రైతుల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలి. సుప్రీంకోర్టు ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసిన, రైతాంగం ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్న కనీస మద్దతు ధరకు చట్టబద్దత, రుణ మాఫీ వంటి చర్యలకు తక్షణం శ్రీకారం చుట్టాలి.

## తెలంగాణ పల్లెల్లో ఇంటర్నెట్ విప్లవం..

పల్లెలే దేశాభివృద్ధి సూచికలు. ఒక దేశం పురోగతిని గ్రామీణ ప్రాంతల్లో ప్రజల జీవన పరిస్థితులు నిర్వచిస్తాయి. తెలంగాణ ఏర్పాటు తరువాత రాష్ట్రం రాష్ట్రం అనేక రకాలుగా ప్రగతి సాధించింది అనేది నిజం. రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌళిక సదుపాయాల కల్పన రంగాలలో మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. రేవంత్ రెడ్డి సర్కార్ దీనిని ముందుకు తీసుకువెళుతోంది. ఈ క్రమంలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ విప్లవాన్ని తీసుకురాబోతోంది. ప్రతి ఇల్లు ఇక ఇంటర్నెట్ సౌకర్యాన్ని పొందనుంది.రూ.300కే ఇంటర్‌నెట్ కనెక్షన్ అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. రాష్ట్రంలోని లక్షల ఇళ్లకు దశలవారీగా ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పించనుంది. ఇది వై కనెక్షన్ లాంటిది. ఈ కనెక్షన్ తీసుకుంటే వర్చువల్ నెట్‌వర్క్‌తో పాటు టెలిఫోన్, పలు తెలుగు ఓటీటీలను గ్రామీణ ప్రజలు చూడటానికి వీలుపడుతుంది. మొదటి దశలో నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లోని 2,096 పంచాయతీల్లో అమలు చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం దీనిని ప్రారంభిస్తారు. తరువాత మిగిలిన గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తిచేయనున్నారు. దేశంలోని అన్ని గ్రామాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించే లక్ష్యంతో భారత్ నెట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్రానికి రూ.2,500 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద గ్రామాల్లో ప్రతి ఇంటికి అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు ఫైబర్ నెట్ కనెక్షన్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వ్యవస్థ ఏర్పాటు బాధ్యతను టీ ఫైబర్ సంస్థ తీసుకుంది. ప్రతి ఇంటికి రూ.300కే ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ కనెక్షన్ తీసుకుంటే ప్రతి ఇంట్లో ఉన్న టీవీనే కంప్యూటర్‌గా మారుతుందని అధికారులు చెబుతున్నారు. 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో కనెక్షన్ ఇస్తారు. ఈ కనెక్షన్ ద్వారా చెల్లింపులు కూడా చేయవచ్చు. గ్రామంలోని అన్ని కార్యాలయాలకు, స్కూళ్లకు కూడా కనెక్షన్ ఇవ్వనున్నారు. టీవీనే కంప్యూటర్‌గా మారుతుంది కాబట్టి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే అవకాశముంది. ఈ కనెక్షన్ తీసుకునేవారితో హైదరాబాద్ నుంచి సీఎం నేరుగా మాట్లాడే వీలు కలుగుతుందని అధికారులు తెలిపారు.

ప్రతి గ్రామంలోనూ జంక్షన్లు, ఇతర చోట్ల కూడా అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి ÷బైర్‌నెట్‌తో అనుసంధానం చేయబోతున్నారు. ఇవి ప్రతి పోలీసుస్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమవుతాయి. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ అనుసంధానంతో పాటు డిజిటల్ సేవలు అందించడమే టీ-÷బైర్ లక్ష్యం. టీ ఫైబర్ నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్(టీ-ఎన్‌వోసీ) నుంచి ఈ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నాం. 94 మండలాలు, 2,096 గ్రామ పంచాయతీల్లో కమర్షియల్ సేవలు అందించేందుకు వీలుగా పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు తొలిదశలో 30 వేల ప్రభుత్వ సంస్థలను అనుసంధానించేందుకు ప్రణాళికలు చేశాం. ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్(పీవోసీ)లో భాగంగా తొలిదశలో మద్దూరు, సంగుపేట్, అడవి శ్రీరామ్‌పూర్ గ్రామాల్లో టీ÷బైర్ ట్రయల్ సేవలను ఈనెల 8న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. నిజానికి, ఈ స్కీంకు సంబంధించి గత సెప్టెంబర్ నుంచే రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది.

# కడప ఉక్కు పరిశ్రమతో పాలకుల చెలగాటం

కడప ఉక్కు పరిశ్రమ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా కాలంగా చెలగాటమాడుతున్నాయి. పరిశ్రమ వస్తే ఉద్యోగాలు వస్తాయని, బతుకులు బాగు పడతాయని ఎదురు చూస్తున్నసీమ బిడ్డలఆశలు అడియాసలు అవుతున్నాయి. కడప స్టీల్‌ఎలాంట్ కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని గత మంగళవారం లోక్‌సభలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి ప్రకటించారు. ఇప్పటికే విశాఖ ఉక్కు ఉంటుందా, ఊడుతుందా అని ఆందోళనలో ఉన్న రాష్ట్ర ప్రజలకు కేంద్రం చేసిన మరో ద్రోహం ఇది. 20 వేల కోట్ల పెట్టుబడి అంచనాతో 20 లక్షల టన్నుల సామర్థ్యంతో, ప్రత్యక్షంగా 25 వేలు, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాయల సీమ యువతను ఇన్నాళ్ళుగా ఊరించిన పాలకుల నిజ స్వరూపం పార్లమెంట్ సాక్షిగా బయట పడింది. గత పది సంవత్సరాలకు పైగా రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకుండా మోసపూరితంగా వ్యవహరించారు. ప్రస్తుతం కేంద్రంలో తాము అధికారంలో వుండడానికి ఆంధ్ర ప్రజలు తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇచ్చిన బలమే ఆధారమనే స్పృహలో కూడా కేంద్ర పాలకులు లేరు. ఇందుకు ప్రధాన కారణం మన రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల వెన్నెముక లేని రాజకీయ వైఖరులే. వ్యక్తిగత, స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర పాలక, ప్రతిపక్షాల నేతలు కేంద్రం ముందు సాష్టాంగ ప్రణామాలు చేస్తున్నంత కాలం ఆంధ్రకు బిజెపి చేస్తున్న ద్రోహపూరిత వైఖరిలో మార్పు రాదు.

కరువుకు కేరాఫ్ అడ్రస్ అయిన సీమలో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి కడపలో బ్రహ్మణి ఉక్కు పరిశ్రమను నిర్మించాలని 2007 జూన్ 10న అంబవరం గ్రామ సమీపంలో శంకుస్థాపన చేశారు. రైతుల నుండి ఒక్క ఎకర భూ సేకరణ చేయకుండా అందుబాటులో వున్న 10 వేల ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ పరిశ్రమను నిర్మిస్తున్నామని ప్రకటించారు. పరిశ్రమను నిర్మించే బ్రహ్మణి స్టీల్ కంపెనీకి ఎకరం 18 వేల చొప్పున 10 వేల ఎకరాల భూమి అప్పగించారు. పరిశ్రమ ఒక్క అడుగు ముందుకు పడకపోయినా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పాలకులు, వారి అనుచరులు వేల కోట్లు దండుకున్నారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం రాష్ట్ర విభజన జరిగింది. రాష్ట్ర విభజన వల్ల నష్టపోయే ప్రాంతాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం-2014లో కడపలో ప్రభుత్వ రంగంలోనే భారీ ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామని అప్పటి కేంద్ర కాంగ్రెసు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి అధికార బిజెపి దానిని బలపరచింది. రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన పదేళ్ళ తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు 2018లో ఎన్నికలకు సరిగ్గా ఐదు నెలల ముందు గండికోట రిజర్వాయర్ సమీపంలోని కంబాలదిన్నె గ్రామం వద్ద మరోసారి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ప్రభుత్వమే 4 వేల ఎకరాల్లో ఉక్కు పరిశ్రమను నిర్మిస్తుందని ఆయన ప్రకటించారు. దాదాపు నాలుగున్నర సంవత్సరాలు కేంద్ర బిజెపికి మద్దతుదారుడిగానే కాకుండా, కేంద్ర ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా వుంది. ఆ కాలంలో కడప ఉక్కు గురించి కేంద్రంతో మాట్లాడి సాధించకుండా వారి బంధం చెడిన తర్వాత అప్పటి తన పార్టీ రాజ్యసభ సభ్యుడు సి.ఎం. రమేష్‌తో 2018 జూన్ 20న కడపలో నిరాహారదీక్ష చేయించి, ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమను నిర్మిస్తుందని హామీ ఇచ్చి ఆ దీక్షా నాటకానికి తెర దించారు. ఆ నేపథ్యంలోనే 2018 డిసెంబర్ 27న ఉక్కు పరిశ్రమకు రెండవసారి శంకుస్థాపన జరిగింది. తర్వాత జగన్ మోహన్ రెడ్డి 2019 డిసెంబర్ 23న మూడోసారి శంకుస్థాపన చేశారు. పరిశ్రమ నిర్మాణంలో ప్రభుత్వరతో పాటు ప్రైవేటు భాగస్వామ్యానికి అవకాశం కల్పిస్తూ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్ఎఫ్‌పి) పద్ధతుల్లో గ్లోబల్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పరిశ్రమకు ప్రతి సంవత్సరానికి రెండు టిఎంసీల



నీరు, నాలుగు లైన్ల రోడ్లు, రైలు మార్గం ఏర్పాటు కోసం టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లకు పని దొరికింది. పాలకులకు కమిషన్లు అందాయి. పరిశ్రమ మాత్రం ఒక్క అడుగు ముందుకు పోలేదు. తిరిగి 2023 ఫిబ్రవరి 15న ఇదే ఉక్కు పరిశ్రమకు మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నాలుగు సార్లు

శంకుస్థాపన చేసినా పని ఒక్క అంగుళం కూడా ముందుకు జరగని ఏకైక పరిశ్రమ బహుశా ఇదేనేమో! వెనుకబడిన ప్రాంతాల గురించి మొసలి కన్నీరు కారుస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో, పరిశ్రమ పేరుతో కాంట్రాక్టు పనుల్లో కమిషన్లలో కోట్లు కొల్లగొట్టడానికి, ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి శంకుస్థాపనలు చేస్తూ రాయలసీమ ప్రజలను పాలక పార్టీలు పదేపదే మోసం చేస్తున్నాయి. రాష్ట్ర విభజన చట్టంలో రూపొందించిన అంశాలపై ఆనాడు కేంద్రంలో ప్రతిపక్ష పార్టీగా బీజేపీ నానా రగడ చేసింది. ప్రత్యేక హోదాతో పాటు, కడప ఉక్కు పరిశ్రమ గురించి నాడు తెలుగుదేశం, పవన్, జగన్‌తో కలిసి తిరుపతి సభలో ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. ఆ తర్వాత మాటల గారడీకి తెరలేపింది. కడపలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ నిర్మించడం సాంకేతికంగా, ఆర్థికంగా లాభదాయకం కాదని సన్నాయి నొక్కులు నొక్కింది. సొంత గనులు లేకుండా ఉక్కు పరిశ్రమ నిర్మించలేమని మరో వాదన తెచ్చారు. 'సెయిల్' అధ్యయనం పేరుతో కడప ఉక్కు పరిశ్రమ నష్టాదాయకమని చెప్పారు. ఈ వితండ వాదనలు చేస్తున్న కేంద్ర బిజెపి ని నాటి అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైసిపి కనీసంగా కూడా ప్రశ్నించలేదు. పార్లమెంట్‌లో నిలదీసి ఉక్కు పరిశ్రమ సాధనకు ఉద్యమం చేయలేదు. కలిసి మెలసి వున్నకాలం పూర్తయిన తర్వాత తెలుగుదేశం నాయకులు కేంద్రాన్ని విమర్శించడం ప్రారంభించారు. కడపలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తామని, రాయసీమలో రెండో రాజధాని, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టులకు 20 వేల కోట్ల నిధులు అంటూ 16 డిమాండ్లతో కూడిన రాయలసీమ డిక్లరేషన్‌ను బిజెపి 2018 ఫిబ్రవరి 22న కర్నూలులో ప్రకటించింది. దీనికి ప్రతిగా 'ప్రజలను మభ్యపెట్టడంలో దిట్టలు మోడీ, అమిత్‌షాలని టిడిపి ఎంపీ గల్లా జయదేవ్ తీవ్రంగా విమర్శించారు. వెంటనే బిజెపి రాయలసీమ వాదన అందుకుంది.

వైసిపి అధికారంలో వున్నంతకాలం కేంద్ర బిజెపికి పార్లమెంట్‌లో అండగా నిలచింది. వినాశకర బిల్లులు, విధానాలన్నింటినీ బలపరచింది. రాష్ట్రంలో అమలుచేసేందుకు అతి ఉత్సాహాన్ని ప్రదర్శించింది. ఇంతా చేసి కడపకు ఉక్కు పరిశ్రమను మాత్రం సాధించలేకపోయింది. టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో జతకట్టిన వెంటనే కడప ఉక్కు పరిశ్రమ వైసిపి కి గుర్తుకు వచ్చింది. కేంద్రం కడప ఉక్కును అడ్డుకుందని వైసిపి నాయకులు విమర్శించడం ప్రారంభించారు.

ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు కడప ఉక్కు గురించి హామీ ఇచ్చిన విషయం కడప జిల్లాలో రెండు ఎంఎల్ఏ సీట్లకు పోటీ చేసిన బిజెపికి తెలియదా? అప్పుడు ఉక్కు పరిశ్రమ సాధ్యంకాదని ఎందుకు చెప్పలేదు? రాష్ట్రం కోసం ఎవరినైనా ప్రశ్నిస్తా అని చెప్పిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కడప ఉక్కు లేదని కేంద్రమంత్రి పార్లమెంట్‌లో చెబుతుంటే ఎందుకు కేంద్రాన్ని ప్రశ్నించరు?

# కుటుంబ నియంత్రణ : రాష్ట్రాల తర్జనభర్జన

మొత్తం సంతానోత్పతి రేటును బాగా తగ్గించడంలో భారత దేశం గర్వించదగిన పాత్ర వహించింది. 1965లో ప్రతి మహిళ కనీసం ఐదుగురికి జన్మనివ్వగా 2022లో ఇద్దరు పిల్లలకు జన్మనివ్వడం అపురూపంగా మారింది. దీనిని బట్టి దేశం సంతానోత్పత్తిని ఎంత కనీస స్థాయికి తగ్గించగలిగిందో స్పష్టమవుతుంది. 1975 నుంచి 1977 వరకు ఎమర్జెన్సీ కాలంలో బలవంతంగా కుటుంబ నియంత్రణ చేయించేవారు. అది తప్ప ఎలాంటి క్రూర మైన చట్టాలు లేకుండా ప్రజలు స్వచ్ఛందంగా కుటుంబ నియంత్రణను పాటించడం చెప్పుకోదగిన విశేషం.

చైనాలో ఒకే బిడ్డ విధానాన్ని దాదాపు 36 ఏళ్ల పాటు పాటించారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో ఒకటైన భారత్‌లో సంతానం భర్తీ రేటు 2.01 స్థాయికి పతనం కావడం బహుశా మంచి పరిణామం కాకపోవచ్చు. 2050 నాటికి మొత్తం సంతానోత్పత్తి రేటు 1.29 స్థాయికి బాగా దిగజారిపోవచ్చని లాన్సెట్ నివేదిక అంచనా వేసింది. అంటే ఆర్థికంగా భారత్ అభివృద్ధి చెందడం కన్నా ముందుగానే వృద్ధాప్యంలోకి చేరుకుంటుందని ఊహించవచ్చు. భవిష్య జనాభాను ఎదుర్కోడానికి పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలు చేసినట్టు ఆరోగ్య సంరక్షణను పెంపొందిచడం, శ్రామిక శక్తికి తగిన శిక్షణ ఇవ్వడం, బీమా పాలసీలను అందుబాటులోకి తీసుకురావడంతో సహా అనేక విధానాలు ఉన్నాయి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ ఇటీవల వెలువరించిన ముగ్గురు పిల్లల ప్రమాణం జనాభాను ఎదుర్కొనే విధానాలు కావు. రెండేళ్ల క్రితం జనాభా నియంత్రణ పాటించాలని మోహన్ భాగవత్ ఇచ్చిన పిలుపుకు ఇప్పుడు ముగ్గురు సంతానం అనే పిలుపు తీవ్రవైరుధ్యం.

ఆనాడు హిందువులకు, ముస్లింలకు మధ్య సంతానోత్పత్తి రేటులో వ్యత్యాసంపై ఆయన సూచన చేశారు. ఇప్పుడు జనాభా అభివృద్ధి రేటు పతనం కావడం, జనాభా స్తబ్దత యొక్క పరిణామాన్ని భారత్ ఎదుర్కోవడం, సామాజిక ప్రమాదాన్ని చుట్టుముట్టిందని భాగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధిని వేగవంతం చేయడానికి జనాభా పెరుగుదలను ప్రోత్సహించడమే సులువైన మార్గంగా కనిపిస్తోందన్నభావం వ్యక్తమవుతోంది. నిర్దిష్టమైన స్కాండినేవియా దేశాలు, ఇతర ఐరోపా దేశాలు కొన్ని దశాబ్దాలుగా సంతానోత్పత్తి రేటు క్షీణతతో సతమవుతున్నాయి.ఆయా కుటుంబాలకు పిల్లల సంరక్షణ రాయితీలను అందిస్తున్నాయి. ఈ దేశాలు ఇప్పుడు సామాజిక ఆర్థిక పురోగతిని కొంతవరకు సాధించడం, సమర్ధవంతమైన పాలనా విధానాలతో సామాజిక తిరోగమనం లేకుండా జనాభా అభివృద్ధి లక్షాలను సాధిస్తున్నాయి. ఉదాహరణకు ఆయా దేశాల్లో పేటర్నిటీ లీవ్ (పితృత్వ శెలవు) వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. అంటే బిడ్డ పుట్టిన తరువాత తండ్రికి ఉద్యోగం నుండి వచ్చే శెలవు సమయం. ఇది తండ్రులు లేదా కావలసిన తల్లిదండ్రులకు తమ కొత్త బిడ్డను చూసుకోవడానికి, అనుబంధం కోసం తీసుకోగల ఒక రకమైన శెలవు.

మన దేశంలో ఈ విషయంలో అసమానత కనిపిస్తోంది. ప్రసూతి సంక్షేమం అసమానతతో పాటు అసమర్ధతతో ఉంటోంది. ముగ్గురు బిడ్డల ప్రమాణం ఆపదలతో నిండి ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి లెక్కలేని జనాభాతో దేశం సామాజిక ప్రయోజనాలను చాలా వరకు కోల్పోవడం జరుగుతోంది. ముఖ్యంగా ముగ్గురు పిల్లల్ని కనాలనే విధానం మహిళల హక్కులకు వ్యతిరేకం. సంతానాన్ని పొందడం, తరువాత వారిని సంరక్షించడం,పెంచిపెద్ద చేయడం ఇవన్నీ విచక్షణారహితంగా మహిళలపైనే భారమైన బాధ్యతలుగా



ఈరోజు కూడా కొనసాగుతున్నాయి. ఉన్నత చదువులు చదువుకోవాలన్నా, ఉద్యోగాలు చేయాలన్న, ఇంకా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలన్నా సంతానం పొందడంతో ఒకేసారి ఈ అవకాశాలన్నీ మహిళలకు దూరమైపోతున్నాయి.

పేద కుటుంబాలకు చెందిన, సంప్రదాయ విధానాలకు కట్టుబడిన మహిళల విషయం ఇంకా దారుణంగా ఉంటోంది. పిల్లలను కనే యంత్రాలుగా, వారికి చాకిరీ చేసే వ్యవస్థలుగా మిగిలిపోతుంటారు. భారత్‌లోని మహిళా కార్మికుల ప్రాతినిధ్యం కేవలం 37 శాతానికే పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నకుటుంబాల్లో బాధ్యతల భారం వహించడంలో మహిళలే ముందుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ముగ్గురు పిల్లల్ని కనిపెంచే కీలకమైన బాధ్యతను స్వీకరించడానికి సాధారణంగా మహిళలు ఇష్టపడరు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఇద్దరికి మించి పిల్లలు ఉండకూడదన్న ఆంక్షలను రద్దు చేశారు.

పిల్లలు ఎక్కువ ఉన్న కుటుంబాలకు రాయితీలు కల్పించాలన్న ఆలోచనలో కూడా ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అదే ఆలోచనలో ఉంటోంది. రాష్ట్రాలలో నియోజక వర్గాల పునర్విభజన అంశం కూడా ప్రస్తుతం చర్చనీయాంశం అవుతోంది. జనాభా తక్కువ ఉంటే ఆయా రాష్ట్రాలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం సరిగ్గా లభించదన్న అంశం ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలను వెంటాడుతోంది. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు ఈ విషయంలో తర్జనభర్జన పడుతున్నాయి.

ఈ భయాలు పూర్తిగా తప్పుకాకపోవచ్చు కానీ ప్రభుత్వాల పాలనా విధానాలలో ఈ మేరకు నిర్ణయాలను తక్షణం తీసుకోవాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. అందువల్ల జనాభా సుడిగుండం ఈ రాష్ట్రాల్లో అలజడి సృష్టించవచ్చు. అధిక సంతానవంతులైన కుటుంబాలను ప్రోత్సహించడం రాష్ట్రాలకు భారీ ఎదురుదెబ్బ. పాశ్చాత్య దేశాల్లో కూడా రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, మేక్రాన్, మస్క్, మెలోనీ, తదితర నేతలు, దక్షిణ కొరియా, జపాన్ ప్రభుత్వాలు కూడా సంతానోత్పత్తి రేటును పెంచుకోవాలని తాపత్రయ పడుతున్నారు. కానీ బలవంతంగా పిల్లల కోసం మహిళలను బానిసలుగా చేయడానికి ఆ దేశాల మహిళలు అంగీకరించే పరిస్థితి కనిపించడం లేదు.



## రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ నేతగా ఎన్నికైన రామకృష్ణ

**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 7:**
తెలంగాణ యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల్లో 4994 ఓట్లతో రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పొలమోని రామకృష్ణ ను ఇబ్రహీం పట్నం ఎంఎల్ ఏ మల్ రెడ్డి రంగారెడ్డి అభినందించారు,భారీ మెజారిటీతో గెలుపొందిన రామ కృష్ణ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు, ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తో పాటు యాచారం మండల మాజీ ఎంపీపీరాచర్లవెంకటేశ్వర్లు, యువనేత మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ,తదితరులు బాల శివుడిని అభినందించారు. అలాగే సుదీర్ఘ కాలంగా యూత్ కాంగ్రెస్ లో సేవలు అందించిన తనకు రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కావడంలో కీలక పాత్ర పోషించిన తాళ్ళ బాలశివుడు గౌడ్ ను వారి నివాసంలో కలిసి విజయం అంకితం చేయడం జరిగిందని రామకృష్ణ తెలిపారు,

### గుజరాత్ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుపై చర్యలు తీసుకోవాలని
## పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**- హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎంపి, ఎమ్మెల్యే లు**

**వెలుతురు, హయత్ నగర్, డిసెంబర్ 7:**
గుజరాత్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర కాంత్ రఘునాథ్ పాటిల్ ను అరెస్ట్ చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీం పట్నం ఎంఎల్ ఏ మల్ రెడ్డి రంగా రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హయత్ నగర్



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ఆయన ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు,గుజరాత్ బిజెపి నేత తన ఎక్స్ ఖాతాలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత రాహుల్ గాంధీపై మార్ఫింగ్ ఫోటోలు పోస్ట్ చేసి రాహుల్ గాంధీ నల్ల ధనం కల్గి ఉన్నారని ప్రచారం చేసినందున ఆయన పై కేసు నమోదు చేయాలని కిరణ్ కుమార్ రెడ్డి. రంగారెడ్డి లు హయత్ నగర్ పోలీస్ స్టేషన్ సిఐ నాగరాజ్ గౌడ్ కు ఫీర్యాదు చేశారు.గుజరాత్ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు గా ఉన్న వ్యక్తి ఇలాంటి విష ప్రచారం చేయడం వల్ల రాహుల్ గాంధీ ప్రతిష్ట దెబ్బ తిన్నది అని వారు పిర్యాదు లో పేర్కొన్నారు. పాటిల్ పై దేశ న్యాయ సంహిత , జాతీయ ఐటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు,

## ఎట్టకేలకు చిక్కిన అంబులెన్స్ దొంగ

**వెలుతురు, హయత్ నగర్, డిసెంబర్ 7:**
హయత్ నగర్ లో 108 అంబులెన్సు వాహనం ను దొంగిలించి పోలీసులను ముప్పు తిప్పలు పెట్టి చివరకు దొంగను అరెస్ట్ చేసిన సంఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం హయత్ నగర్ లో పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం





ఏర్పాటు చేసిన అంబులెన్సు ను ఓ వ్యక్తి దొంగిలించి జాతీయ రహదారిపై రచ్చ రచ్చ చేశాడు.పోలీసులు అంబులెన్స్ ను వెంబడించడంతో దొంగ అంబులెన్స్ ను పంతంగి టోల్ గేట్ వద్ద జాన్ రెడ్డి అనే వ్యక్తి డీ కొట్టాడు . దీంతో అతను అంబులెన్సు ను వేగంగా తీసుకు వెళ్తూ కొర్ల పహాడ్ టోల్ గేట్ వద్ద గేట్ ను డీ కొట్టాడు అక్కడి నుంచి వేగంగా వెళ్లుతుండంతో పోలీసులు అంబులెన్స్ దొంగను పట్టు కునేందుకు లారీలను అడ్డం పెట్టి అంబులెన్స్ దొంగను పట్టుకున్నారు, కాగా ప్రమాద%శీ% కు గురైన వ్యక్తి చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే అంబులెన్స్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆటో నగర్‌లో జరిగిన మెకానికల్ యూనియన్ ఎన్నికలు

**- అధ్యక్షుడుగా కృష్ణ, కార్యదర్శిగా రవి కుమార్**

**వెలుతురు, వనస్థలి పురం, డిసెంబర్ 7:**
ఆటో నగర్ లోని మెకానికల్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ఎన్నికైన కృష్ణ తెలిపారు, శనివారం ఆటో నగర్ మెకానికల్ టెక్నీషియన్ అసోసేషన్ యూనియన్ ఎన్నికలు జరిగాయి, ఈ ఎన్నికలో 463 మంది కార్మికులు ఓట్ల వేశారు.కాగా ఈ ఎన్నికల్లో అధ్యక్షుడు గా కృష్ణ, కార్య దర్శి గా రవి కుమార్,కోశాధికారిగా సత్యం లు ఎన్నికయ్యారు.



### ప్రజా ప్రభుత్వపాలనకు ఏడాది...
# తెలంగాణ పునర్నిర్మాణానికి ఇది పునాది

**- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి డిసెంబర్ 7 వెలుతురు:**
కాంగ్రెస్ పార్టీ ఏడాదిలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేసిన ప్రభుత్వం భవిష్యత్ నాలుగేళ్లలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం బి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బాలాజీ నగర్, కేపీహెచ్ బి డివిజన్ ల అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, తమ్మినేని ప్రవీణ్ లు సంయుక్తంగా నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలకు ముఖ్య అతిధులుగా ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తా, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి, సన్నాలకు బోనస్ ఇచ్చిందని




అన్నారు. భారతదేశంలోనే తొలిసారి 50 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేసిందన్నారు. ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి, మహిళలకు ఉచిత బస్సు, గృహ జ్యోతి పథకం కింద రూ. 500 వంట గ్యాస్ సిలిండర్, జీరో కరెంట్ బిల్ వంటి పథకాలు పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. అందుకే ఆ పార్టీని ప్రజలు ఓడించారని అన్నారు.

ఈ కార్య క్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, సాధు ప్రతాప్ రెడ్డి, విట్టల్ రెడ్డి, గోపిశెట్టి రాఘవేందర్, గూడెపు నాగరాజు, మేకల మైఖేల్, డివిజన్ అధ్యక్షులు, మొయినుద్దీన్, సత్యనారాయణ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, ఏఎంసీ డైరెక్టర్లు జమీల్, ఫణి కుమార్, సుధాకర్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి జహంగీర్, కూకట్ పల్లి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి సలీం, ఏ బ్లాక్ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, సంధ్య, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు మారుతీ, జోజమ్మ, రజిత, భారతమ్మ, రేష్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్యపై చర్యలు తీసుకోవాలి

**వెలమ కులస్తులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన మాధవరం రంగారావు**

**కూకట్ పల్లి డిసెంబర్ 7 వెలుతురు:** షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య వెలమ కులస్తులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు స్పందిస్తూ చాలా బాధాకర మని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేసిన ముఖ్యమంత్రులు ఎవరు కూడా కులాల ప్రస్తావనికి తీసుకురాకుండా అన్ని కులాల ప్రజలందరూ సమానమే అని పరిపాలనా మీద దృష్టి పెట్టి వారికి తోచిన విధంగా అభివృద్ధి చేసి ఎన్నికల అప్పుడు చేసిన అభివృద్ధి చెపుతూ చేయబోయే అభివృద్ధిని మేనిఫెస్టో ద్వారా పెట్టి ప్రజల దగ్గరికి వెళ్లి ఓటు అనే ఆయుధం ద్వారా ప్రజల దీవెనలు అడిగేవారన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం కాకముందు, అయిన తర్వాత కూడా చాలాసార్లు చాలా కులాల గురించి అవహేళన చేస్తూ



మాట్లాడే వారు ఆయన ధైర్యం చుసుకొని నేడు షాద్ నగర్ శాసనసభ్యులు శంకరయ్య రెచ్చిపోయి వెలమ కొడుకుల్లారా అని చెప్పి వెలమ కులస్తులను చంపేస్తానని నిన్న సోషల్ మీడియా ద్వారా ప్రస్తావించడం బాధాకర మన్నారు.

కాంగ్రెస్ పార్టీలో కూడా వివిధ కులాల వారు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు ఇలాంటి ప్రస్తావని ఎప్పుడు రాలేదు మరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నప్పుడే ఇలాంటి ప్రస్తావని ఎందుకు వస్తుందో ప్రజలందరూ కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అలాగే శాసనసభ్యులు శంకరయ్యని పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్, ముఖ్యమంత్రికి ఈ మాటలు వెనుక ఏమి సంబంధం లేకపోతే ఆయన మీద చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

లేకపోతే ప్రజలకి శాసనసభ్యుల మీద గాని శాసనాలు చేసే అసెంబ్లీ మీద గాని పూర్తిగా నమ్మకం పోయి రాబోయే రోజుల్లో ఎలక్షన్స్ అంటేనే ఓటింగ్‌కి రాకుండా ఉండే ప్రమాదం ఉందని అన్నారు.

తెలంగాణ ఉద్యమంలో అన్ని మతాలను వారిని అన్ని కులాల వారిని కలుపుకొని రాను అనుకున్న తెలంగాణను తీసుకొచ్చిన తర్వాత కూడా అన్ని మతాలవారికి, కులాల వారికి స్థలాలు, భవనాలు, కట్టించి అన్ని రకాలుగా అన్ని కులాలలో ఉన్న బడుగు బలహీన వర్గాలను ఆదుకోవాలని పథకాలు కూడా పెట్టిన కేసీఆర్‌నీ ఉద్దేశించి నేడు వెలమ కులస్తులని దూషించారా ఎమ్మెల్యే శంకరయ్య చెప్పాల్సిన అవసరం ఉందనీ అన్నారు.

# జీహెచ్‌ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం..

- 2 లక్షల రుణమాఫీతో దేశం దృష్టి సారించిన తెలంగాణ..
- మూసి అభివృద్ధితో హైదరాబాద్‌కు మరింత ఖ్యాతి..
- 6 గ్యారంటీల అమలుతో రాష్ట్రం మరింత అభివృద్ధి..
- బిజెపి, బిఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం...
- మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి..

**కూకట్‌పల్లి, డిసెంబర్ 7 వెలుతురు:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సీఎం రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇస్తామని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బి.బ్లాక్ కమిటీ ఆధ్వర్యంలో కూకట్ పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సాధు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆసియాలో అతిపెద్ద కాలనీగా పేరుం దిన కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో టెంపుల్ బస్ స్టాప్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ విజయోత్సవ సభా కార్యక్రమానికి హరివర్ధన్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, కూకట్పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల హామీతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అయితే గత ప్రభుత్వం కేసీఆర్ హయంలో ఆర్థిక విధ్వంసం చేసిందన్నారు. ప్రజల కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుంటే భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీలు ఏకమై అడ్డుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రెండు లక్షల రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం దేశం దృష్టిని ఆకర్షించింది అన్నారు. బిజెపి, బీఆర్ఎస్ ఒక్కటేనని చీకట్లో ఒప్పందాల కుదుర్చుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ సర్వతో ముఖాభివృద్ధికి కృషిలో



భాగంగా మూసి ప్రక్షాళనతో హైదరాబాద్ నగర ఖ్యాతిని పెంచడంతోపాటు కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత రంగారెడ్డి, నల్గొండ జిల్లా రైతులకు మేలు చేసే కార్యక్రమాన్ని చేపడితే బిజెపి బీఆర్ఎస్‌లు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన మూసి అభివృద్ధి ప్రక్షాళన ఆగదని అన్నారు.

6 గ్యారంటీలను అమలు చేసి రాష్ట్రంలో ఉన్న నిరు పేదల జీవితాల్లో వెలుగు నింపుతారని ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో జరిగే ఏ స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మ్రోగిస్తుం దన్నారు. ప్రజలు ప్రతిపక్షాల దురుద్దేశ పూరిత విమర్శలకు ఆకర్షితులై వారి మాటలు నమ్మితే నష్టపోతారన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం పలు ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల సంక్షేమాన్ని కృషి చేస్తుందన్నారు. కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. ఇప్పటికే మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణంతోపాటు పలు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కృష్ణా రాజ్ పుత్, ఫణీంద్ర కుమార్, సంజీవరావు, మేకల మైకల్, పొడుగు అప్పారావు, సంధ్య, రేష్మ, జోజమ్మ, డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రంగస్వామి, శివ చౌదరి, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, బుచ్చి మల్లి, బాల్నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సోను, శ్రీధర్ చారి, రాజు ముదిరాజ్, గిరి నాయుడు, మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్యపై చర్యలు తీసుకోవాలి

**- కూకట్‌పల్లి వెలమ సంఘం నాయకులు..**

**కూకట్‌పల్లి, డిసెంబర్ 7, వెలుతురు:**
షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య వెలమ కులస్తులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఎర్రబెల్లి సతీష్ రావు, కంచనపల్లి నాగరాజు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి వెలమ కులానికి చెందిన నాయకులు వీర్లపల్లి శంక రయ్యపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధ వరం కృష్ణారావుకు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ కు విన్నవించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే శంకరయ్య దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి అనంతరం కూకట్‌పల్లి ప్రధాన రహదారిపై దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం కూకట్పల్లి పోలీస్ స్టేషన్లో ఎమ్మెల్యే శంకరయ్య పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెలమ సంఘం నాయకులు మాట్లాడుతూ ఒక ప్రజా ప్రతినిధిగా శాసనసభ నియోజకవర్గానికి



ప్రాతినిధ్యం వహిస్తూ ఒక కులాన్ని టార్గెట్ గా చేసుకొని విమర్శించారు. ఒక్క కులాలని విమర్శించి తిట్టడం పైన కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షుడుతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే ఎమ్మెల్యే పైన చర్యలు తీసుకోకపోతే తాము పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒకరు అమ్మను ఎంతగా ప్రేమగా చూసుకుంటారో వారి కులాన్ని కూడా అంతగానే అభిమానిస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కులాలకు సంబంధించి రాజకీయ నాయకులు ప్రస్తావించడం మంచి పద్ధతి కాదని ఇకనైనా ఆ తీరుని మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఆనందరావు, ఎర్రబెల్లి వాసుదేవరావు, ఉదయ్, సోమేశ్వరరావు, ప్రభాకర్ రావు, రమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు.. 66 మోసాలు..

**కూకట్‌పల్లి డిసెంబర్ 7 వెలుతురు:ల** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్చనపల్లి సూర్యారావు అన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై కూకట్ పల్లీ నియోజకవర్గంలో శనివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మూసాపేట్ డివిజన్ పరిధిలోనీ చిత్తరమ్మ ఆలయం దగ్గర నుంచి బైక్ ర్యాలీని ప్రారంభం చేసుకుని భరత్ నగర్ మీదుగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని జింకల వాడ, ప్రభాకర్ రెడ్డి నగర్, దీన్ దయాల్ నగర్, పైప్ లైన్ రోడ్డు మీదుగా శోభన సర్కిల్ నుంచి బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీ, సాయి నగర్ మీదుగా ఫెరోజ్ గూడ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ కాలనీ, భాగ్యశ్రీ గార్డెన్ , హస్మత్ పెట్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ బైక్ ర్యాలీకి ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా (అర్బన్ ) ప్రముఖ్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హర్షనపల్లి సూర్యరావు హాజరై బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓల్డ్ బోయిన్ పల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 6 గ్యారంటీలు 66 వాగ్దానాలు కావు అవి 6 అబద్ధాలు 66 మోసాలని , అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే నెరవేరుస్తామని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఏడాది కాలం పూర్తి చేసుకున్న పూర్తిస్థాయిలో ఏ ఒక్క గ్యారంటీని కూడ అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. నిరంకుశ పాలనకు స్వస్తి చెప్పి ప్రజాస్వామిక పాలనను అందిస్తామన్న కాంగ్రెస్ పార్టీ హైడ్రా అనే సంస్థను తీసుకొచ్చి




బడా బాబులకు పక్షపాతం వహిస్తూ, పేద మధ్యతరగతి ప్రజలను భయాందోళనకు గురి చేసిందని వారు తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 68'వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ బైక్ ర్యాలీలో మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్ యాదవ్, డాకయ్య, మల్లేష్ గౌడ్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, యువ మోర్చ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ సహాయంతో దోమల మందు పిచికారీ చేయించిన కార్పొరేటర్ దొడ్ల

**కూకట్‌పల్లి. డిసెంబర్ 7 వెలుతురు:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని గురుగోవింద్ సింగ్ నగర్ లోని పరికి చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు దోమల బెడద సమస్య ఎక్కువగా ఉందని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ ఎంటమాలజీ సిబ్బందితో కలిసి దోమల నివారణ కోసం పరికి చెరువులోని తిమేపాస్ కెమికల్ డ్రోన్ యంత్రం సహాయంతో శనివారం పిచికారి చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దోమల నివారణకు తిమేపాస్ కెమికల్ డోన్ యంత్రం సహాయంతో పిచ్చుకారి చేయడం వలన చెరువులో ఉన్నటువంటి దోమ గుడ్లు దోమ పిల్లలు అనగా దోమలు (లార్వ దశలోనే) అరికట్టవచ్చు అన్నారు. కాబట్టి ప్రజలు కూడా



తమవంతు బాధ్యత వహించి మన ఇంటి పరిసరాలు ఇంటి బయట లోపల ఎక్కువ రోజులు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకసారైనా నీటి నిల్వలను తనిఖీ చేసుకోవాలన్నారు నీటి నిల్వల పాత్రలపైన ఎల్లప్పుడూ మూతలు ఉంచలని అన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ మీ ఇంటి దగ్గరికి వచ్చే ఎంటమాలజీ సిబ్బందికి సహకరించాలని అన్నారు. చెత్తను కూడా వీధుల్లో, కాలువల్లో, చెరువుల్లో వేయకుండా తడి చెత్త పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాడుగౌడ్, గుడ్ల శ్రీనివాస్, కరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి, డిసెంబర్ 7, వెలుతురు:**
ప్రభుత్వం నుంచి దివ్యాంగులకు రావలసిన పరికరాలను అందించవలసిన బాధ్యత ప్రభుత్వ అధికారుల పైన ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కూకట్ పల్లి ఐడియల్ చెరువు వద్ద ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు.

అనంతరం ఎమ్మెల్యే వికలాంగులకు బ్యాటరీ త్రీ వీల్ సైకిళ్లు, సంక కర్రలు, చేతి కర్రలను, వీల్ కుర్చీలను అందజేశారు. వికలాంగుల అధ్యక్షులు వెంకటస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు అందించాల్సిన పరికరాలను, ఈ ప్రభుత్వం



వికలాంగుల పెంచిన పెన్షన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ ఎల్లప్పుడూ వికలాంగులకు అండగా తాను ఉంటానని గతంలో తన సొంత నిధులతో వందల మందికి ఉచితంగా మోటారు సైకిలను అందించామని రాబోయే రోజుల్లో మరి కొంతమందికి ఉచితంగా మోటార్ సైకిళ్లు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అదేవిధంగా ప్రభుత్వం నుండి వికలాంగులకు రావాల్సిన పరికరాలను వచ్చే విధంగా అధికారులతో మాట్లాడుతానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు కొన్ని నాగేశ్వరావు రాష్ట్ర నాయకులు బుద్ధికొండ కిరణ్ , అధ్యక్షులు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి చిరంజీవి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ స్వామినారాయణ గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్,

# ఒలింపిక్స్ గ్రాండ్ ఫినాలే



## పాల్గొన్న మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామి

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వెలుతురు డిసెంబర్ 07:** శ్రీ స్వామినారాయణ గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్, బండ్లగూడ– గురుకుల ఒలింపిక్స్ గ్రాండ్ ఫినాలేలో గురుకుల ఒలింపిక్స్ (GO 2024) గ్రాండ్ స్పోర్ట్స్ ఫియెస్టా ఫైనల్ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆరోగ్య అధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామి ముఖ్య అదితిగా హాజరై, విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ టి. రఘునాథ్ స్వామి గారు విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఆయన మాట్లాడుతూ, "క్రీడలు మనకు సహనాన్ని, సమర్థతను, మరియు ప్రతిదానికి ధైర్యంగా ఎదుర్కొనే తత్వాన్ని నేర్పుతాయి. ఇవి మన జీవితాన్ని ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన గుణాలు. నిజమైన విజయం ప్రతి ఆట నుండి ఏదో ఒక పాఠం నేర్చుకోవడంలోనే ఉంది. ఓటమి కూడా విజయానికి దారి చూపే మెట్టు," అని తెలిపారు. అలాగే, విద్యార్థుల ఆరోగ్యంపై మాట్లాడుతూ, "న్యూట్రిషన్ ఆహారం తీసుకోవడం, క్రీడలు లేదా యోగ వంటి సాధారణ శారీరక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం, మరియు ముఖ్యంగా సరిపడ నిద్ర పొందడం అనేవి ఆరోగ్యానికి ముఖ్యమైనవి" అని ప్రాముఖ్యతను తెలియజేశారు.

ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన స్కూల్ సిబ్బందిని ఆయన అభినందించారు. విద్యార్థుల ఉత్తేజం, క్రీడా శక్తి, మరియు విజయం కోసం వారు చూపిన నిబద్ధతను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.





# కాల్వ సుజాత గుప్తా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బొలిశెట్టి నాగలక్ష్మి శిరీష...

**కూకట్‌పల్లి, డిసెంబర్ 7 వెలుతురు:** కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట్‌లో ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తా, నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ బొలిశెట్టి నాగలక్ష్మి శిరీషకు వారు పార్టీ కండువాను కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బొలిశెట్టి నాగలక్ష్మి శిరీష మాట్లాడుతూ కాల్వ సుజాత కాంగ్రెస్ పార్టీలో ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారని, ఆమె ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు తనకు చాలా సంతోషంగా ఉందని, వారి స్ఫూర్తితో నేను ముందుకు నడుస్తానని పేర్కొన్నారు.

# భస్మార్చన ప్రత్యేక పూజలో పాల్గొన్న కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు..

**కూకట్‌పల్లి డిసెంబర్ 7 వెలుతురు:** శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని చైతన్య నగర్ నాగదేవత గుడిలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా 108 కిలోల భస్మార్చన




కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నరసయ్య, బాలరాజు, నర్సింగ్ రావు, అనిల్ ,మల్లేష్, పవన్, కిరణ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

## - జనంపల్లి పురేందర్ రెడ్డి..

**కూకట్‌పల్లి, డిసెంబర్ 7 వెలుతురు:** ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ ను కలిగి ఉండాలని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి అన్నారు. శనివారం అమీర్ పెట్ సర్కిల్లో నూతన మెడ్విల్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ ట్రాన్స్ఫోర్ట్ కమిషనర్ ఎన్ వాణి, మూసాపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి. వంశీకృష్ణ, డిఎఫ్ఓ ఎం రాజరత్నం, డాక్టర్ సతీష్, రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డిలు



హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా ఆరోగ్య రీత్యా ప్రతి ఒక్కరికి, వస్తువుల గాని ఇన్సూరెన్స్ చాలా అవసరమని మోటార్ వెహికల్స్, గృహ పరికరాల గాని ప్రతిదానికి ఇన్సూరెన్స్ ఎంతో అవసరమన్నారు. జేబులో డబ్బు లేకున్నా మనకు ఇన్సూరెన్స్ ఉంటే మనము ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఇన్సూరెన్స్ వలన హాస్పిటల్ లో ఏ వ్యాధినైనా నయం చేసుకొని ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో మేలు చేస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరు ఆలోచించి ఇన్సూరెన్స్ చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మెడ్విల్ మేనేజింగ్ డైరెక్టర్ జి ఈశ్వర్ రావు, కమిటీ సభ్యులు నాగేందర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాకు నవోదయ విద్యాలయం ఏర్పాటుకై కేంద్ర కేబినెట్ నిర్ణయం హర్షణీయం

## జహీరాబాద్ బీజేవైఎమ్ జిల్లా నాయకులు నరేష్ పాటిల్

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 07:** మెదక్ ఉమ్మడి జిల్ల సంగారెడ్డి కి జవహర్ నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బీజేవైఎమ్ జిల్లా నాయకులు నరేష్ పాటిల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులందరికి అభినందనలు తెలియజేశారు. అనంతరం బీజేవైఎమ్ నాయకులు నరేష్ పాటిల్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం



నవోదయ విద్యాలయాలను తీసుకువచ్చిందని అందులో మన సంగారెడ్డి జిల్లాకు కేటాయించడం చాలా ఆనందంగా ఉంది అందుకే వారికీ ప్రతేక ధన్యవాదములని పేర్కొన్నారు.



## సియం సహాయ నిధి చెక్కులు పంపిణీ

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 07:**
సంగారెడ్డి జిల్లా జహిరాబాద్ నియోజకవర్గం మొగుడం పల్లి మండలం ఖాన్ జమాల్ పూర్ కు చెందిన అమృత్, మన్నాపూర్ గ్రామానికి చెందిన ధనరాజ్ లకు మాజీ మంత్రి జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్ సిఫార్సు తో 75 వేల విలువ గల ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనా చెక్కులను క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి వర్యులు జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్ ఆదేశాలతో మండల అద్యక్షులు మఖ్సూద్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , మాజీ మంత్రి వర్యులు జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్ కి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే మాణిక్ రావు...

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 07:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిధిలోని హుగ్గెలి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ కు 39 వేల రూపాయలు విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాణిక్ రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు




నారాయణ, పాక్స్ చైర్మన్ మచ్చెందర్, హుగ్గెలి గ్రామ మాజీ ఎంపీటీసీ రాములు , రాథోడ్ భీమ్ రావు నాయక్, దత్తు రెడ్డి, జలీల్, ముఖిమ్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు...

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 07:**
యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గా గెలుపొందిన కె.జగదీశ్వర్ రెడ్డి, మండలం అధ్యక్షుడిగా గెలుపొందిన సునిల్ లను శనివారం జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు జమిలాలోద్దీన్ లు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో అల్లీపూర్ సుభాష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లీకార్జున్, బి.నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.



## మహమ్మద్ ముజ్జామిల్‌కు శుభాకాంక్షలు తెలిపిన టిజిఐడిసి చైర్మన్ తన్వీర్...

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 07:**
యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో కోహిర్ మండల యూత్ ప్రెసిడెంట్ ఎన్నికైన మహమ్మద్ ముజ్జామిల్ శనివారం మర్యాదపూర్వకంగా మాజీ టిజిఐడిసి చైర్మన్ మహమ్మద్ తన్వీర్



ను జహీరాబాద్ పట్టణంలోని వారి నివాస గృహానికి వెళ్ళి కలిశారు. ఈ సందర్భంగా మాజీ టిజిఐడిసి చైర్మన్ మహమ్మద్ తన్వీర్ నూతనంగా కోహిర్ మండల యూత్ ప్రెసిడెంట్ ఎన్నికైన మహమ్మద్ ముజ్జామిల్ కు పూలమాలవేసి శాలువాతో సత్కరించిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మాజీ ఎంపీటీసీ హనాన్ జావిద్, యూసుఫ్ పటేల్, మజీద్ తదితరులు ఉన్నారు.

## టిఆర్ఎస్ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం..

**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 7:** రామన్నపేట మండలంలోని టిఆర్ఎస్ పార్టీ నాయకులను సీఎం సభ అనే సాకుతో ఉదయమే ముందస్తుగా అరెస్టు చేసి రామన్నపేట పోలీస్ స్టేషన్కు తీసుకురావడం జరిగింది. ఈ రాష్ట్రంలో ప్రజా పాలన అని చెప్పుకుంటూ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్షగట్టి ఎలాంటి కారణం లేకుండా, అరెస్టులు చేసి స్టేషన్లలో ఉంచడం జరుగుతుంది. అరెస్ట్ అయిన వారు టిఆర్ఎస్ మండల ప్రధాన



కార్యదర్శి పోషబోయిన మల్లేశం. మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, పున్న వెంకటేశం, ఎండి అమీర్, నాయకులు మిరియాల మల్లేశం, లవణం రాము, జాల అమరేందర్ రెడ్డి, నల్ల సైదులు, బాసాని రాజు, రేముడాల వెంకటేష్, నరసింహ తదితరులు ఉన్నారు.






## మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు

- ప్రతీ విద్యార్థికి చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..
- చిన్న చిన్న సమస్యలువస్తే వాటిని అధిగమించడానికి చట్టాలు తోడ్పాడుతాయి..
- సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరి కృష్ణ

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 07:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో స్థానిక మాణిక్ ప్రభు హై స్కూల్ చట్టాలపై అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరి కృష్ణ నిర్వహించి విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థికి చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతయినా అవసరమని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నిత్యజీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదురుకాకుండా ఉండడానికి, ఒకవేళ సమస్యలువస్తే వాటిని అధిగమించడానికి చట్టాలు తొడ్పాడుతాయని సూచించారు. కార్యక్రమంలో పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, మోటారు వాహనాల చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, జువైనెల్ జస్టిస్ యాక్ట్, ఉచిత న్యాయ సేవా సహాయంపై విద్యార్థులకు తెలియ జేసారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించి, చట్టాలను గౌరవిస్తూ, అవసరమైతే తోటివారికి తెలియ జేప్పుతూ సమాజానికి ఆదర్శవంతంగా ఉండాలని సూచించారు. మీ చుట్టు బాల్య వివాహ బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు గుర్తిస్తే స్థానిక తహసీల్దార్ లేదా స్థానిక పోలీస్ అధికారికి లేదా మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయంలో గాని లేదా 1098 కి ఫోన్ ద్వారా తెలుపవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడ తాయని తెలియజేసారు.
ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ గోపాల్, ప్యానెల్ అడ్వకేట్ రుద్రయ్య స్వామి, రాఘవేందర్ నాయక్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, కరెస్పాండంట్ ఎం. వెంకటయ్య, ప్రిన్సిపాల్ ఎం. మధుసూదన్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎర్రగడ్డలో రాష్ట్ర టీబీ శిక్షణ మరియు ప్రదర్శన కేంద్రం సమీక్ష సమావేశం

**మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వెలుతురు డిసెంబర్ 07:**
తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల డిస్ట్రిక్ ప్రోగ్రామ్ ఆఫీసర్ల కోసం ఎర్రగడ్డలోని రాష్ట్ర టీబీ శిక్షణ మరియు ప్రదర్శన కేంద్రం లో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రదర్శన చేసిన ప్రోగ్రామ్ ఆఫీసర్లను గౌరవించడంతో పాటు, మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ఎంటిఈపి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు డా. శ్రీదేవి గారిని ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డుతో గౌరవించారు.
ఈ అవార్డును గౌరవనీయ కేంద్ర బొగ్గు మరియు గనుల



మంత్రివర్యులు శ్రీ జి. కిషన్ రెడ్డి, మరియు తెలంగాణ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఎమ్‌డీ ఎంఏచ్‌ఎం డైరెక్టర్ శ్రీ ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్ గారి చేతుల మీదుగా ప్రదానం చేయబడింది.
ఈ సందర్భంగా మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. టి. రఘునాథ్ స్వామి, మెడ్చల్ మల్కాజ్‌గిరి ఆరోగ్య శాఖ అధికారుల మరియు సిబ్బందుల తరఫున డా. శ్రీదేవి గారిని ఈ ప్రాతిష్ఠాత్మక అవార్డు సాధించినందుకు అభినందించారు.

## ఘనంగా పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన విజయోత్సవం

**పటాన్‌చెరు, వెలుతురు డిసెంబర్ 07:**
ప్రజా పాలన ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన విజయోత్సవ సంబరాలలో భాగంగా శనివారం రోజున పటాన్ చెరు నియోజకవర్గ స్థాయి విజయోత్సవ సమావేశాన్ని పటాన్ చెరు మండలం బచ్చుగూడ గ్రామంలో పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ.మెట్టు సాయి కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెదక్ పార్లమెంట్ ఇంఛార్జి నీలం మధు, పీసీసీ





సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్ గౌడ్,
బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్స్ గడ్డం శ్రీశైలం, శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఎస్ సి సెల్ కన్వీనర్ నరసింహారెడ్డి, సంగారెడ్డి జిల్లా మైనారిటీ ఛైర్మెన్ హబీబ్ జానీ, సంగారెడ్డి జిల్లా INTUC ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, మండల ప్రెసిడెంట్స్ సుధాకర్ గౌడ్, నర్సింగ్ రావు, అశోక్ ముదిరాజ్, మునిసిపాలిటీ ప్రెసిడెంట్స్ జైపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, ఎంపీటీసీ నరేందర్ రెడ్డి, గోపాల్, యాదగిరి, శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ నరేష్, కౌన్సిలర్ చంద్రారెడ్డి, భుజంగారెడ్డి, మహిళ కాంగ్రెస్ శోభక్రిష్ణ రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మ, రాజి రెడ్డి, శివానందం, సుధాకర్, విక్రమ్ గౌడ్, వీరారెడ్డి, అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, కె ఎస్ జి యువసేన సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయం హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**రాష్ట్ర ఇరిగేషన్ సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సూర్యాపేట నియోజకవర్గం ఇంఛార్జ్ , మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ధన్యవాదములు తెలిపిన నాయకులు**

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 7:** సూర్యాపేట జిల్లా లో జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయడం పట్ల సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజద్ ఆలి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కరీమ్ బేగ్‌లు హర్షం వ్యక్తం చేశారు.



శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఇరిగేషన్, సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సూర్యాపేట నియోజకవర్గం ఇంఛార్జ్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిలు గత ఐదేళ్ల క్రితం జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని, వారి కృషి ఫలితంగా నేడు కేంద్రం ప్రకటన చేయడం పట్ల వారు ధన్యవాదములు తెలిపారు.

## ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

**- తపస్ రాష్ట్ర కార్యదర్శి పబ్బతి శ్రీనాకర్ రెడ్డి**

**తూప్రాన్ వెలుతురు డిసెంబర్ 7:**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా కార్యవర్గ సమావేశం తూప్రాన్ మండల కేంద్రంలోని నలంద డిగ్రీ కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, పెండింగ్ మెడికల్ జిపిఎఫ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు అన్నారు.తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మాట్లాడుతూ పెండింగ్ డిఏ లను ప్రకటించాలని, పి ఆర్ సి ని ప్రకటించి, వెంటనే అమలు చేయాలని, డిసెంబర్ 17 వ తేదీ నాడు ఇందిరా పార్క్ వద్ద






ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ స్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలలో ఖాళీ అయిన స్థానాలను ప్రమోషన్ల ద్వారా నింపాలి అని, ప్రభుత్వ ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించొద్దని, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకులాలలో ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం,చల్లా లక్ష్మణ్ తపస్ రాష్ట్ర కార్యదర్శి దుబాషి భాస్కర్, తపస్ మహిళా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు స్వరూప రాణి, సుజాత, తుప్రాన్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భాను ప్రసాద్, సంతోష్ తపస్ జిల్లా నాయకులు రవీందర్, చక్రవర్తి, వేణు,సుమతి,సంజీవ్, శ్రీకాంత్ రెడ్డి, జ్ఞానేశ్వర్,రాజేశ్వర్,మెట్టుశేఖర్,లక్ష్మీ నారాయణ, మల్లేష్, ప్రసాద్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి, నరేందర్ గౌడ్, నాగిరెడ్డి,కృష్ణ మూర్తి, ఆంజనేయులు, తులసిరామ్ వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిద్దు,ఉమ్లా నాయక్, నర్సింలు ,నాగిరెడ్డి,ప్రభాకర్,చంద్రయ్య,పోచయ్య, స్వామి, శ్రీనివాస్, కృష్ణ, దుర్గ ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## భానూర్ గ్రామంలో శ్రీ అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ

### దర్శించుకున్న మెట్టు సాయి కుమార్, కాట శ్రీనివాస్ గౌడ్, నీలం మధు

**పటాన్‌చెరు వెలుతురు డిసెంబర్ 07:** పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామంలో బొమ్మ రవీందర్ గురుస్వామి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ మహోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ.మెట్టు సాయి కుమార్, పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్, మెదక్ పార్లమెంట్ ఇంఛార్జి నీలం మధు, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, కె ఎస్ జి యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## నల్తూర్ గ్రామంలో శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవంలో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్

**జిన్నారం వెలుతురు డిసెంబర్ 07:** జిన్నారం మండలం నల్తూర్ గ్రామంలో లక్ష్మణ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ



అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్న పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ గారు.



### ఊట్ల గ్రామంలో అంగరంగ వైభవంగా

## అయ్యప్ప స్వామి పడిపూజ

### అశేషంగా తరలివచ్చిన అయ్యప్ప స్వాములు

### పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్

**జిన్నారం వెలుతురు డిసెంబర్ 07:** జిన్నారం మండలం ఊట్ల గ్రామంలో అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. స్వాములు వందలాదిగా తరలివచ్చి అయ్యప్ప



స్వామి భజనలు, సంకీర్తనలు, స్వామి నామస్మరణతో ఊట్ల గ్రామం మారుమ్రోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు

## బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి

### జనవరి 2025లో జరిగే జనగణనలో బీసీ కులగణను చేయాలని కేంద్రం హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసిన బీసీ నేత లింగంగౌడ్



**న్యూఢిల్లీ వెలుతురు డిసెంబర్ 07:** జనాభాలో సగానికి పైగా ఉన్నటువంటి వెనుకబడిన తరగతుల కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అధ్వర్యంలో న్యూఢిల్లీలోని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గారిని అయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు జాజుల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అనేక సామాజిక వర్గాలకు మంత్రిత్వ శాఖలు ఉన్నాయని కానీ మెజార్టీగా ఉన్న బీసీలకు ఎందుకు ఏర్పాటు చేయటం లేదని ప్రశ్నించారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు తోనే కులాల సాంఘీక ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని అన్నారు.జనవరి 2025 లో జరిగే జనగణనలో బీసీ కులగణను చేయాలని కోరారు.కులగణనతోనే కులాల యొక్క సామాజిక,ఆర్థిక, రాజకీయ పరిస్థితులు తెలుస్థాయి. మంత్రిని కలిసిన వారిలో బీసీ యువజన సంఘం నాయకులు ఈడిగ శ్రీనివాస్ ఉన్నారు.

## సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు టిపిటిఎఫ్ సంపూర్ణ మద్దతు!

### సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలి!!

### సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం ట్కెం స్కేలు వర్తింపజేయాలి!!!

### టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్



**కామారెడ్డి వెలుతురు డిసెంబర్ 07:** సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలకు హాజరై టి పి టి ఎఫ్ రాష్ట్ర శాఖ పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగింది మరియు ఈ నెల 10 నుండి చేపట్టబోతున్న నిరవధిక సమ్మెకు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. అనిల్ కుమార్, తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలు కావడం లేదని, వెట్టి చాకిరి విధానం అమలవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విభాగంలో సుమారుగా 19,360 మంది ఉద్యోగులు పనిచేస్తురన్నారు. ఉద్యోగులు ఏళ్ళ తరబడి పనిచేస్తున్నప్పటికీ, పనికి తగిన వేతనం లభించడం లేదు, ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు.

ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా సమ్మెను నివారించడానికి గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సర్వీసును వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, మినిమం ట్కెం స్కేలు వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మె విజయవంతానికి టిపిటిఎఫ్ మండల, జిల్లా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## సంక్షేమ ఫలాలు ప్రతి గడపకు చేరే విధంగా కళాపదర్శన

**వెలుతురు న్యూస్, సూర్యాపేట డిసెంబర్ 7:** సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కాసింపేట, 5వ వార్డు దురాజ్ పల్లి, 6వ వార్డు దాసాయిగూడెం, వార్డులలో ప్రతి ఇంటికి ప్రజా పాలన పథకాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీమ్ లీడర్ వేముల శ్రవణ్ అన్నారు. ఏడాదిపాలన పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ మరియు సమాచార పౌర సంబంధాల అధికారి ఆదేశాల ప్రకారం జిల్లా లోనీ ప్రతి గ్రామం లో,ప్రతి మండలం మున్సిపాలిటీలో మూడు నుంచి ఐదు గ్రామాలలో వార్డులలో కళా జాత ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ఆరు గ్యారంటీలలో ప్రతి మహిళ ఉచిత బస్ ప్రయాణం చేయడం తో ప్రతి మహిళ కండ్ల లో ఆనందం కనబడుతుందని తెలిపారు. ప్రతి మహిళకు ఐదు వందల సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ను అందించడం జరుగుతుందని అర్హులైన పేదలకు ఐదు లక్షల రూపాయల తో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేయడం జరుగుతుందని రైతులకు రైతు భరోసా పేరుతో రెండు లక్షల రూపాయల రుణ మాఫీ చేయడం జరిగిందని అన్నారు.



గృహ జ్యోతి పథకం తో ప్రతి ఇంటికి రెండు వందల యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు స్కిల్ యూనివర్ సిటితో రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు గిరిజన శిక్షణ ఉపాధి కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ పథకాలు అందుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళా కారులు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట బిక్షపతి, ఉపాధ్యక్షులు పల్లెల రాము,పల్లెల లక్ష్మణ్, ఒంటెపాక ప్రియంక, నెమ్మాది స్రవంతి, మేడి ప్రియదర్శిని, మేడి ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు

## సంస్థాన్ మాజీ ఎంపిపిలు మృతి-మండలంలో తీవ్ర విషాదం

### - మాజీ ఎంపిపి కాటం రాములు మృతిని జీర్ణించుకోలేని కుమారుడు శ్రీ శైలం ఉరి వేసుకొని ఆత్మహత్య

### - సర్వేల్ గ్రామంలో తీవ్ర విషాదం

**వెలుతురు, చౌటుప్పల్, డిసెంబర్ 7:** భువనగిరి యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిషత్ అధ్యక్షులు వెనువెంటనే మృతి చెందడం పట్ల మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మొన్న మాజీ ఎంపిపి కాటం రాములు మృతి చెందగా నేడు మరో మాజీ ఎంపిపి మంచికంటి జనార్ధన్ మృతి చెందడం బాధాకరమని మండల ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. ఇదిలావుండగా మాజీ ఎంపిపి కాటం రాములు కుమారుడు తన తండ్రి మృతి చెందడాన్ని జీర్ణించుకోలేని స్థితిలో కాటం రాములు కుమారుడు శ్రీశైలం మృతి చెందడం పట్ల ప్రజలు తీవ్ర విచారం వ్యక్తంచేస్తున్నారు. గతంలో సంస్థాన్ నారాయణపురం మండల ఎంపిపి లుగా పనిచేసిన కాటం రాములు. మంచికంటి జనార్ధన్‌లు అనారోగ్యంతో మృతి చెందడంతో గతంలో వారు మండల అభివృద్ధి కోసం కృషి చేసిన విషయంపై ప్రజలు ఈ సందర్భంగా చర్చించుకుంటున్నారు. మండలంలో వెంట వెంటనే ఇరువురు మాజీ ఎంపిపి లు మృతి చెందడం పై





మండలంలో తీవ్ర విచారం వ్యక్తమవుతున్నది. వారు ప్రజా సమస్యలపై స్పందించి వెనువెంటనే ప్రజాఉపయోగ కార్యక్రమాలు చేపట్టడం జరిగింగేదని ప్రజలు భావిస్తున్నారు. కాగా మాజీ ఎంపిపి లు కాటం రాములు స్వగ్రామం సర్వేల్. మంచి కంటి జనార్ధన్ స్వగ్రామం వావిళ్ళపల్లి గ్రామంలో విషాదశాయాలు అలముక్కున్నాయి. కాగా ఇప్పటికే సర్వేల్ గ్రామంలో కాటం రాములు అంత్యక్రియలు జరిగాయి. ఇక మంచికంటి జనార్ధన్ అంతిమ సంస్కారాలు నేడు జరుగ నున్నాయి.



### సర్వేల్ లో విషాదం

సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. శుక్ర వారం మృతి చెందిన సర్వేల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి కాటం రాములు కుమారుడు కాటం శ్రీశైలం తన తండ్రి మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శని వారం తమ వ్యసాయ వ్యవసాయ బావి వద్ద ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటనతో మండలంలో విషాదం అలుముకుంది.

## మాజీ ఎంపిపి మృతి: నివాళ్లు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

**సంస్థాన్ నారాయణపురం, వెలుతురు డిసెంబర్ 07:** సంస్థాన్ నారాయణపురం మండలం వావిళ్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎంపిపి మంచి కంటి జనార్ధన్ గుప్తా శుక్రవారం రాత్రి మృతి చెందడం జరిగింది.ఆయన మృతికి అశ్రునివాలు అర్పిస్తూ మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి సంతాపం ప్రకటించారు. మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు గుర్తుచేస్తూ ఘన నివాళులు అర్పించడం జరిగింది. అకాల మరణం చెందినందుకు చింతిస్తూ గాంధేయ మార్గములో కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తకు అండగా నిలబడి గిరిజనులు గిరిజనేతరులకు అండగా ఉండి ప్రజాసేవలో తమకంటూ ఒక ప్రత్యేకతను తెచ్చుకున్న గొప్ప కాంగ్రెస్ వాది. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ , కార్యదర్శి ఏపూరి సతీష్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సర్పంచ్ వంగూరు సత్తయ్య యాదవ్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఏర్పుల సుదర్శన్ , తుంబాయి తండా మాజీ సర్పంచ్ జరుపుల కవిత జగన్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాచకొండ రమేష్ బాబు , జక్కిడి



మెగా రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ , చిలువేరు అంజయ్య , జక్కర్తి రాజు , బొమ్మరబోయిన రవికుమార్, అంతటి ఇస్తారు గౌడ్ , ఉప్పల రాజయ్య , జక్కా నాగభూషణం , శ్రీరాముల మైసయ్య , కార్లపాటి వెంకటేశం గుప్తా , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మెగావాత్ రెడ్య నాయక్ , మండల కార్యదర్శి ఉప్పల నాగరాజు ,యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కొండ నవీన్ గౌడ్ ,గునిగంటి రాజు గౌడ్ , ఉప్మాగుల సాయిబాబా, బొడ్డుపల్లి వెంకటేశం, బోయిని యాదయ్య, కట్ట రాములు, అంద యాదయ్య యాదవ్, గుండమల్ల బలరాం, పాశం ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 25 వరకల్లా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తి చేసి యాప్‌లో అప్లోడ్ చేయాలి

### - జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవర్





**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 7ద:** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను వెరిఫికేషన్ చేసి డిసెంబర్ 25 కల్లా యాప్ లో అన్ని వివరాలను అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవర్ అన్నారు. శనివారం ఐడిఓ సి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి. రాంబాబు తో కలసి జిల్లాలోని ఆర్డీవో,ఎంపీడీవో,ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్లు, వార్డ్ ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీల తో వెబ్ఎక్స్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ మండలాలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో లబ్ధిదారుల అప్లోడ్ ఎంతవరకు వచ్చినదని, ఎంత శాతం వెరిఫికేషన్ పూర్తి చేసి సంబంధిత యాప్ లో అప్లోడ్ చేసినారని మండల అభివృద్ధి అధికారులను,ఎమ్మార్వోలను, ఆర్డీఓలను, మున్సిపల్ కమిషనర్లను అడిగి తెలుసుకున్నారు.

ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తి చేసి కుటుంబ, ఆదాయ వివరాలను ప్రభుత్వ గైడ్లైట్కన్స్ ప్రకారం డిసెంబర్ 25 వరకల్లా యాప్ లో అప్లోడ్ చేయాలని, ఇందుకు గాను మండలాలలో పంచాయతీ సెక్రెటరీలు, పట్టణాలలో వార్డ్ ఆఫీసర్స్ వెరిఫికేషన్ పూర్తి చేసి యాప్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

అలాగే మండలాలలో ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, పట్టణాలలో మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, పర్యటిస్తూ ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తారని నిర్దేశించిన సమయానికి అప్లోడ్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి.రాంబాబు, హౌజింగ్ ఈఈ విజయ్ సింగ్, డిపిఓ నారాయణరెడ్డి, డి సి ఎస్ ఓ రాజేశ్వర్, స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్ అధికారి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## రాచకొండ స్వయంభు శంభులింగేశ్వ ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు

**సంస్థాన్ నారాయణపురం, వెలుతురు డిసెంబర్ 07:** సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ గ్రామా పరిధిలోని శ్రీ స్వయంభుశంభులింగేశ్వరస్వామి దేవస్థానము లోని హుండీ ఆదాయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కిచారు.ఈ లెక్కింపులో హుండీ ఆదాయం 23,130 ఇరవై మూడు వేల నూట ముప్పై రూపాయల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి చిట్టెడి వెంకట్ రెడ్డి దేవాదాయ శాఖ భువనగిరిడివిజన్ పరిశిలకురాలు వెంకట లక్ష్మి, అర్చకులు శరత్ చంద్ర, లక్ష్మణాచారి సిబ్బంది రాజు ,మాజీ సర్పంచ్ భారతమ్మ, నరసింహ, జనార్ధన్, లింగారెడ్డి భక్తులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ సిబ్బంది మండల కమిటీ ఎన్నిక

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు, డిసెంబర్ 07:**
సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని గ్రంధాలయం ఆవరణంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ సిబ్బంది యూనియన్ (సి.ఐ.టి.యు) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో మండల పరిధిలోని గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని గ్రామపంచాయితీ ఎంప్లాయిస్ అండ్ సిబ్బంది యూనియన్ (సిఐటియు )అనుబంధం మండల కమిటీని గౌరవ అధ్యక్షులు నర్సిరెడ్డి, గౌరవ సలహాదారు ముత్యాల చంద్రకాంత్ అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. వారిలో అధ్యక్షులుగా రేవనపల్లి వీరస్వామి, ఉపాధ్యక్షులుగా ఏర్పుల సైదులు, ప్రధాన కార్యదర్శిగా భద్ర బోయిన వెంకటేశం, కోశాధికారిగా జగన్ , సహాయ కార్యదర్శిగా ఏర్పుల నాగేష్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతి రెడ్డి, రాష్ట్ర మహిళా నాయకులు పొట్ట యాదమ్మ, జిల్లా అధ్యక్షులు బిక్షం , కార్యదర్శి ఈశ్వర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. పలు డిమాండ్ల పైన చర్చించడం జరిగింది.

## మాజీ ఎంపిపి జనార్దన్‌కు నివాళ్లు అర్పించిన సిపిఐ నాయకులు

**వెలుతురు, చౌటుప్పల్, డిసెంబర్ 7:**
చౌటుప్పల్ లో భాస్కర్ టాకీస్ యజమాని. సంస్థాన్ నారాయణపురం మండలం మాజీ ఎంపీపీ మంచి కంటి జనార్ధన్ భౌతిక కాయం పై పూలమాలలు వేసి నివాళులర్పించిన



సిపిపి పార్టీ మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకటరెడ్డి, ఉజ్జీని యాదగిరిరావులు, సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు రత్నాకర్ రావు, కే శ్రీనివాస్, బి గాలయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## బాలల గ్రంథాలయాల ఏర్పాటుకు వినతి

**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 07:**
కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త, జాతీయ యువజన అవార్డు గ్రహీత ఏ. కిరణ్ కుమార్ కరీంనగర్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ కలసి వినతి పత్రం అందజేశారు.



ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థలో మాత్రమే బాలల గ్రంథాలయం కొనసాగుతుందని, కరీంనగర్ పట్టణము నగరంగా అభివృద్ధి చెంది చాలా దూరం విస్తరించిందని, భవిష్యత్ కాలంలో గ్రేటర్ కరీంనగర్ గా మారి విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అన్నారు. జిల్లా కేంద్రంలో అనేక విద్యాసంస్థలు ఉన్నాయని, ముఖ్యంగా బాలల కోసం ప్రభుత్వపరమైన గ్రంథాలయాలు లేవని అన్నారు. ముఖ్యంగా పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను పెంపొందించుకోవడం కోసం గ్రంథాలయాలు దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తును రూపొందించుకోవడంలో బాలల లైబ్రరీలు కీలక పాత్ర పోషిస్తాయని, సృజనాత్మకతను పెంపొందే దిశగా నిలిచే బాలల గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.
వినతిపత్రంపై స్పందించిన చైర్మన్ బాలల గ్రంథాలయం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ తో పాటు యువజన సంఘాల సమితి ప్రతినిధి బోనాల అశోక్ పాల్గొన్నారు.

## కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా హెచ్ఎంఎస్ పోరాటం చేస్తుంది

**హెచ్ఎంఎస్, జాతీయ ప్రధాన కార్యదర్శి, సుదర్శన్ రావు**

**గోదావరిఖని,డిసెంబర్ 7, (వెలుతురు):**
కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక,ప్రజా,కర్షక వ్యతిరేక విధానాలపై హెచ్ ఎం ఎస్, పోరాటం చేస్తుందని హెచ్ ఎం ఎస్, జాతీయ కార్యదర్శి ఎస్.సుదర్శన్ రావు తెలిపారు. ఎన్టీపీసీ లోని శ్రీమయి గ్రాండ్ హోటల్ లో శనివారం,ఏర్పాటు చేసిన హెచ్ ఎం ఎస్,రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోల్చితే భారతదేశంలో కార్మిక రంగం జీతాల పెరుగుదలలో చాలా వ్యత్యాసాన్ని కలిగివుందని అన్నారు.
భారతదేశంలో ఒక అన్ స్కిల్ కార్మికుడు హైఏస్ట్ ఎగ్జిక్యూటివ్ స్థాయి జీతం పొందాలంటే 942 సంవత్సరాలు పడుతుందని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా దగా చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో మెజారిటీ ఉందని, ప్రతిపక్షాలను, కార్మిక సంఘాలను సంప్రదించకుండానే 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చారని ఆరోపించారు. కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాలు తప్పా మరోమార్గం లేదన్నారు.
ఈ సమావేశంలో హెచ్ ఎం ఎస్,రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.ఉపేందర్,నాయకులు నర్సయ్య,కుమారస్వామి,రామారావు,ఈశ్వరప్రసాద్,గొల్లపల్లి శ్రీనివాస్, పురుషోత్తం రావు,పాల్గొన్నారు.

# ఏడాది కాంగ్రెస్ పాలనలో మార్పు రాలే.. బతుకులు మారలే..!

**కొత్త రేషన్ కార్డు ఇచ్చే దమ్ము ధైర్యం లేని చేతగాని దద్దమ్మ ప్రభుత్వం...**

**బిఆర్ఎస్ లెక్కనే కాంగ్రెస్ పాలన... జూట మాటలతో ప్రజలను ఎంతకాలం మోసం చేస్తారు..?**

**దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై నిలదీస్తాం**

**కాంగ్రెస్ ప్రభుత్వానివి 6 అబద్ధాలు 66 మోసాలు ...**

**కాంగ్రెస్ గ్యారంటీల గారడి, అబద్దాల హామీలను ప్రజలకు వివరించడానికే బిజెపి పోరుబాట...**

**టవర్ సర్కిల్ సభలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు....**

**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 07:**
తెలంగాణ రాష్ట్రంలో మారింది పాలకులేనని, గత బిఆర్ఎస్ అడుగుజాడల్లో కాంగ్రెస్ నడుస్తుందని , పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దొందు దొందేనని, రాష్ట్ర పాలనలో మార్పు రాలేదని, ప్రజల బతుకులు మారలేదని, మాయ మాటలు మోసపూరిత వాగ్దానాలతో హామీలతో ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బిజెపి పోరుబాట కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబా ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం రోజున శాతవాహన యూనివర్సిటీ నుండి టవర్ సర్కిల్ వరకు భారీ వాహన ర్యాలీ చేపట్టి సభ నిర్వహించారు. ఇట్టి ర్యాలీ, సభకు ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం అడ్డగోలు హామీలు, గ్యారంటీలను ఇచ్చి, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రజల తరపున బిజెపి పోరుబాట చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతుందని, వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఏ ఒక్క గ్యారెంటీ నైనా సక్రమంగా అమలు చేయలేకపోయిందన్నారు. కుంటి సాకులు చెబుతూ కాలం



వెళ్లదీసింది తప్ప ఏ ఒక్క వర్గానికి మేలు చేయలేకపోయిందన్నారు . రైతు భరోసా రూ . 15వే లు, రైతు కూలీలకు 12వేలు, మాయ మాటలే తప్ప ఆచరణలో లేదన్నారు.రుణమాఫీ అరకొరేనని, వరి బోనస్ పై బోగస్ మాటలు చెబుతున్నారని విమర్శించారు. మహాలక్ష్మి అని మహిళలను మోసం చేశారన్నారు. ఆడబిడ్డలకు ప్రతినెల ఇస్తామన్న రూ.2500 ను అటకెక్కించారని , రూ.500 సిలిండర్ రాయితీ కార్యక్రమం అరకోరాగానే కొనసాగించిందన్నారు పేదలకు సొంతిల్లు కలగానే మిగిలి పోయిందని, ఒక డబల్ బెడ్ రూమ్ కూడా ఇవ్వలేదని, ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల సహాయం అందించలేదని విమర్శిం చారు. యువ వికాసం పథకం ద్వారా అందిస్తామన్న ఐదు లక్షల విద్యా భరోసా కార్డు, మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ ఉత్తిత్తి హామీలుగా మారాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, వాగ్దానాలు హామీలు కోకొల్లలు ఉన్నాయని, అందులో ఏ ఒక్కటి కూడా సక్రమంగా నెరవేర్చలేకపోయిందన్నారు. ఒకప్పుడు రెండు వేల పింఛన్ వచ్చుడే గగనం అనుకుంటే , రూ.4,000 పింఛన్ ఇస్తామని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు అబద్దాలు, 66 మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. జూట మాటలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. మోసం చేయడం



కాంగ్రెస్ నైజం అని, అందుకే మోసాలను నిలదీయడానికి బిజెపి పోరాటం చేస్తుందన్నారు. ఇట్టికార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవ రెడ్డి, కన్న కృష్ణ, ఎర్రబెల్లి సంపత్ రావు , కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, టౌన్ 1,2 కన్వీనర్లు కోలగని శ్రీనివాస్, గుంజేటి శివకుమార్, మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, కన్న బోయిన ఓదెలు, మండల, జోన్ అధ్యక్షులు కంచె శేఖర్, కడార్ల రతన్, అవదుర్తి శ్రీనివాస్, జాడి బాల్ రెడ్డి, పురం హరి, తనకు సాయి, కార్పొరేటర్లు వంగల పవన్, బండ రమణ, నాగసముద్రం ప్రవీణ్, కొలగని శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, రాజు , జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణ రెడ్డి, రాజు, లడ్డు ముందడ, మాసం గణేష్, శివానందం తోపాటు కరీంనగర్ అసెంబ్లీ బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆసంపల్లి శ్రీనివాస్ డొనేట్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణకు సిద్ధం

**గోదావరిఖని,డిసెంబర్ 7, (వెలుతురు):**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆసంపల్లి లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్, ఆసంపల్లి శ్రీనివాస్,(వాసు), గత నెల రోజుల క్రితం ప్రకటించిన విధంగా భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, తొలి విగ్రహం ఆవిష్కరణకు సిద్ధమైంది, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు కురుమ పల్లి సర్పంచ్, మామిడిపల్లి బాపయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, సభ్యులు, గవర్నమెంట్ ఆఫ్, తెలంగాణ, సీనియర్ జర్నలిస్టు బొంకూరి మధు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్ ( వాసు)తో విగ్రహాల డొనేట్ కోసం మాట్లాడడం జరిగింది. దళిత బహుజన వర్గాలలో సామాజిక ఆర్థిక సాంస్కృతిక విద్యా రాజకీయం పరమైన మార్పును తీసుకురావాలన్న ఉద్దేశంతో ఆయా గ్రామాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే, దళిత బహుజన అణగారిన వర్గాల ప్రజలు చైతన్యవంతులవుతారని, అందుకు సహకరించవలసిందిగా కోరడం జరిగింది, వెంటనే స్పందించిన ఆసంపల్లిశ్రీనివాస్, వాసు ,భారతరత్న రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి దళిత వర్గాల ఆశాజ్యోతి, బాబాసాహెబ్ అంబేద్కర్, 100 విగ్రహాలు ఇచ్చేందుకు ముందుకు రావడం జరిగింది, వారికి ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పక్షాన, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం, ఓదెల మండలం నాంసానిపల్లి గ్రామంలో వారం రోజుల క్రితం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, విగ్రహాన్ని, నల్లాల,రామ నరసయ్య, గ్రామస్తుల ఆధ్వర్యంలో గద్దెపై ప్రతిష్టించడం జరిగింది, త్వరలోనే నాంసానిపల్లి అంబేద్కర్ యువజన సంఘం నాయకులు , గ్రామస్తుల సమిష్టి నిర్ణయంతో,ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.



# ప్రతి పేదవాడికి ఇండ్లు :ఎమ్మెల్యేరాజ్ ఠాకూర్

**గోదావరిఖని,డిసెంబర్ 7, (వెలుతురు):**
ప్రతి పేదవాడికి ఇండ్లను ఇచ్చే కార్యక్రమం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు .
రామగుండం మున్సిపల్ , కార్పొరేషన్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ పొందిన 634 మంది లబ్ధిదారులకు ప్లేట్ నంబర్ కేటాయింపు కార్యక్రమం చేపట్టారు. శనివారం,ఎన్ టి పి సి, లోని లక్ష్మి నరసింహ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై లాటరీ ద్వారా ప్లేట్స్ కేటాయింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను మొదటివిడతగా రాష్ట్రప్రభుత్వం కేటాయింపు చేపట్టిందని అందులో భాగంగా గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పొందిన వారికీ ప్లేట్ నంబర్ కేటాయించడం జరుగుతుందని తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్ లో వికలాంగ లబ్దిదారులకు , మిగతా వారికీ డ్రాలో వచ్చిన ప్రకారం నెంబర్స్ కేటాయించి వారికీ డబుల్ బెడ్ రూమ్ లను అందించడం జరుగుతుందని అన్నారు. ఇవేకాకుండా ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లును అందించే భాద్యత తనదని అన్నారు. అలాగే రామగుండం ప్రాంతాన్ని అభివృద్ధి దిశగా



తీసుకువెళ్లడంలో శాయశక్తులా కృషి చేస్తున్నానని వెల్లడించారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధిలో ఈప్రాంతంలో మన శ్రమతో ఏర్పడిన సింగరేణి ,ఎన్ టి పి సి, ఆర్ ఎఫ్ సి ఎల్ , సంస్థలను కూడా భాగస్వాములను చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, ఏసీపీ మడత రమేష్,మహంకాళి స్వామి, ముస్తఫా , అసిఫ్ పాషా,పాతిపెల్లి ఎల్లయ్య, తిప్పారపు శ్రీనివాస్,దీటి బాలరాజు , కార్పొరేటర్లు, నాయకులూ , మహిళలు పాల్గొన్నారు.

# కమీషనరేట్ ఆర్మ్డ్ హెడ్ క్వార్టర్స్‌ని తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ అడ్మిన్

**ఏమైనా సమస్యలుంటే నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావచ్చు: అడిషనల్ డీసీపీ అడ్మిన్, సి. రాజు,**

**గోదావరిఖని,డిసెంబర్ 7, (వెలుతురు):**
రామగుండం పోలీస్ కమీషనర్,ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి ,ఆదేశాల మేరకు శనివారం, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, రామగుండం పోలీస్ కమీషనరేట్ అర్మడ్ హెడ్ క్వార్టర్స్ లో వార్షిక తనిఖీ లలో భాగంగా సాయుధ ధళ పోలీసుల సమీకరణ కవాతు కి ముఖ్య అతిథి గా హాజరై గౌరవ వదనం స్వీకరించి తరువాత ఆర్మ్ డ్ రిజర్వ్/ సాయుధ దళాల సిబ్బంది టర్న్ అవుట్ పరిశీలించి కొంతమంది సిబ్బంది కి రివార్డ్ ప్రకటించడం జరిగింది. అనంతరం సెర్మోనల్ డ్రిల్ సిబ్బంది ప్రదర్శించిన పరేడ్ పరిశీలించారు. తరువాత సిబ్బంది తో మాట్లాడి సిబ్బంది యొక్క సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. సిబ్బంది చెప్పిన సమస్యలను, పోలీస్ వెల్ఫేర్ లను కూడా త్వరలో పరిష్కారించడం జరుగుతుంది అని తెలిపారు. ఏఆర్ సిబ్బంది ఒక్క ఏఆర్ డ్యూటీనే కాకుండా సివిల్ సిబ్బందికి సహాయంగా విధులు చేస్తున్నార న్నారు.
క్రమశిక్షణతో పనిచేస్తూ ఆ రంగాలకు మంచి పేరుతెస్తున్నా రన్నారు. లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమానంగా పని



చేస్తున్నారన్నారు. ఏమైనాసమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావలన్నారు. క్రమశిక్షణ తో కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థానం లో ఉంటారన్నారు. అనంతరం ఆర్మడ్ హెడ్ క్వార్టర్స్, ఆర్ఐ ఆఫీస్, రికార్డ్స్, బెల్లఫ్ ఆర్మ్స్, బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ లను తనిఖీ చేశారు. సిబ్బంది డ్యూటీల గురించి అడగి తెలుసు కున్నారు.
ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసిపి ప్రతాప్ , ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, ఆర్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఓపెన్ కాస్ట్ బ్లాస్టింగ్‌లతో భయబ్రాంతులకు గురవుతున్న ప్రజలు

**గోదావరిఖని,డిసెంబర్ 7, (వెలుతురు):**
సింగరేణి,ఓపెన్ కాస్ట్, ల భారీ బ్లాస్టింగలతో భయభ్రాంతులకు గురైతున్న ప్రభావిత ప్రాంతాల ప్రజలు. ఏమి పట్టనట్లు చోద్యం చూస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు బ్లాస్టింగ్ పై డి జి ఎం ఎస్, కు ఫిర్యాదు చేసినట్లు స్వచ్ఛంద సంస్థ నాయకుడు మద్దెల దినేష్, తెలిపారు. ఓసిపి-3 & 5 భారీ బ్లాస్టింగ్లతో ప్రభావిత ప్రాంతాల ఇండ్లు కూలిపోయే ప్రమాదం ఉంది, ప్రజలు బయందోళను కు గురౌతున్నారు, రోజు రోజు భారీ బ్లాస్టింగ్లు చేస్తూ పొమ్మన లేక పోగ పెడుతున్నారు. నేడు ఆర్ ఎఫ్ సి ఎల్, ఫ్యాక్టరీ నుండి అమోనియా వాసన వల్ల ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు, ప్రజల పట్ల వారి సంక్షేమం పట్ల నిర్లక్ష్యం చేస్తున్న పరిశ్రమల యజమాన్యాలు.
పరిశ్రమల వల్ల ఉపయోగాలు అధికార పార్టీ నేతలకు పరిశ్రమల ప్రాబవిత ప్రాంతాల ప్రజలకు రోజురోజుకు అనేక కష్టాలా?ఇంత జరగుతున్న పట్టించుకోని స్థానిక పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్.. పట్టించుకోవడంలేదని ఆయన పేర్కొన్నారు, ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్, బోర్డ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



చాలా తక్కువ మందికే తెలిసిన వంటకం.. అరకు అందాలను చూడటానికి వెళ్లిన వారికి మాత్రమే పరిచయమున్న ఘుమఘుమ. ఇప్పుడు రాజధాని వాసుల నోరు ఊరిస్తోంది. అదే బొంగులో బిర్యానీ. బొంగులో చికెన్.. ఇది చాలామందికి తెలిసిన రుచే.. అయితే అరకు, బొర్రాగుహలకు మాత్రమే ప్రత్యేకమైన వెదురు బిర్యానీ ఇప్పుడు మన ప్రాంతంలో పాగా వేసేందుకు వచ్చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ వంటకు ప్రాచుర్యం కల్పించాలని నిర్ణయించడంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఇప్పుడు భవానీ ద్వీపంలో దీనిని సండే స్పెషల్‌గా ఏర్పాటు చేసింది. కృష్ణానది మధ్యలో.. చల్లని అహ్లాద వాతావరణంలో వేడివేడిగా బొంగు బిర్యానీ తింటుంటే.. ఆహా.. జిహ్వకు ఎంత ఇంపుగా ఉంటదో.. ఇంక లేటెందుకు లే'టేస్ట్' గురించి తెలుసుకుందాం రండి..



# టేస్ట్ సవ'రేటు' బొంగు బిర్యానీ...





**ఇదీ విధానం..**

ముందుగా శుభ్రం చేసిన చికెన్‌కు అల్లం, వెల్లుల్లి పేస్ట్, ఉప్పూ-కారం, చికెన్ మసాలా, పెరుగు, టేస్టింగ్ సాల్ట్ పట్టించి కాసేపు ఉంచుతారు. అలాగే బిర్యానీ రైస్‌ను హాఫ్ బాయిల్డ్ చేస్తారు. ఆ తర్వాత అర కేజీ చికెన్, అర కేజీ రైస్‌ను బొంగులో పెడతారు. బొంగుకు ఒక వైపు సీలు వేసినట్లు (వాసానికి మధ్యలో ఉండే కణుపు) ఉంటుంది. రెండో వైపు అరిటాకుగానీ, విస్తరాకుగానీ మూతగా పెడతారు. అప్పుడు బొంగును కట్టెల పొయ్యిపై ఏటవాలుగా పెట్టి మంటలో కాలుస్తారు. ఇక్కడ విచిత్రమేమిటంటే దీనిలో ఎక్కడా ఆయిల్ కలపరు. పచ్చి వెదురు బొంగులో ఉండే సహజమైన నీటితోనే చికెన్, రైస్ ఉడుకుతాయి.

**రేటు కొంచెం ఎక్కువే..**

బొంగు బిర్యానీ అయినా (రైస్,చికెన్ కలిపి) బొంగు చికెన్ అయినా కిలో ఉంటుంది. వీటిలో ఏదైనా జీఎస్‌టీతో కలిపి రూ.650లు చార్జి చేస్తున్నారు. వీటి తోపాటు కప్పు ఐస్‌క్రీంగానీ, కూల్ డ్రింక్ గానీ ఇస్తున్నారు.

**వెదురు బొంగులు..**

బిర్యానీ తయారీకి ఉపయోగించే పచ్చి వెదురు బొంగులను ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం నుంచి ప్రతి వారం తెప్పిస్తున్నారు. ఈ బిర్యానీ తయారీలో నిపుణుడైన అప్పారావు అనే వ్యక్తిని రంపచోడవరం నుంచి తీసుకువచ్చి ఐలాండ్‌లోని వంట సిబ్బందికి శిక్షణ ఇప్పిస్తున్నారు.

**అందరికీ అందుబాటులో..**

మాంసాహార ప్రియులు బొంగు బిర్యానీ కోసం ఎక్కడికో వెళ్లకుండా.. అందరికీ అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో భవానీ ఐలాండ్‌లో కొత్తగా ప్రవేశపెట్టాం. ప్రతి ఆదివారం లంచ్ కింద ఈ ప్రత్యేక బిర్యానీతోపాటు కుండ బిర్యానీకూడా ఏర్పాటు చేశాం. సందర్శకుల నుంచి లభించే ఆదరణ చూసి ప్రతి రోజూ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తాం.

# నాన్ స్టిక్ పాత్రలు బాగుండాలంటే...

వంటల కొరకు నాన్ స్టిక్ పాత్రలు వాడడం సర్వసాధారణంగా మారిపోయింది. ఎందుకంటే వీటిలో నూనె వాడకం తక్కువ. అలాగే చూడడానికి ఎంతో అందంగా ఉంటాయి. అందుకే ఎక్కువ మంది వంటకు నాన్‌స్టిక్ పాత్రలనే వాడుతున్నారు. కానీ...ఈ పాత్రలు సరిగ్గా ఉపయోగించుకోకపోతే పలు ప్రమాదాలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. మరి ఇవి బాగుండాలంటే కొన్ని చిట్కాలు..



- పాత్రలో నీటిని పోసి కొద్ది సమయం నాననివ్వాలి. తర్వాత మెల్లగా రుద్ది కడిగితే అతుకున్న పదార్థం వదిలిపోతుంది. నాన్‌స్టిక్ పాత్రలను వంటింటి గట్లపైన, అల్మారాల్లో భద్రపరచకుండా, ఎప్పుడూ సామాన్లు భద్రపరిచే స్టాండుల్లోనే పెట్టడం మంచిది.
- క్లీన్ చేయడానికి స్క్రబ్బర్ వాడాల్సి ఉంటుంది. ఎక్కువగా ఘాటుగా ఉండే క్లీనింగ్ పౌడర్ లు ఉపయోగించుకోవడం మంచిది.
- ఈ పాత్రల్లో వండే పదార్థాల కోసం ఉపయోగించే గరిటెలు ప్లాస్టిక్..చెక్కతో కూడుకున్నవి ఉంటే బాగుంటుంది.
- నాన్ స్టిక్ పాత్రలను ఎప్పుడూ సన్నని సెగపైనే ఉంచాలి. ఎక్కువ మంట పెట్టడం వల్ల వీటి పాలిష్ త్వరగా పోతుంది.
- పాత్రలు ఎక్కువ కొత్తగా కనిపించాలంటే వాడిన తరువాత శుభ్రం చేసి మెత్తని బట్టతో తుడిచి, కొద్దిగా నూనెను రాసి భద్రపరచాలి.
- నాన్ స్టిక్ లపై అతికించిన స్టిక్కర్ పాత్రను కొద్దిగా వేడి చేస్తే సులభంగా వస్తుంది. ఆ తర్వాత కొద్దిగా వేడినీటితో శుభ్రంచేసి ఆరబెట్టాలి. చిన్న చెంచాడు నూనెను వేసి మెత్తని బట్టతో పాత్ర అన్ని వైపులకూ రాయాలి.
- తరచుగా నాన్ స్టిక్ వంటసామాను ఉపయోగిస్తూ ఉంటే పిఎఫ్ఒఏ మీ కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుందని వైద్యులు సూచిస్తున్నారు.
- నాన్ స్టిక్ వంటసామాను వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాల గురించి తెలుసుకోవాలి. వాటి వల్ల ఆరోగ్యానికి ఎంత హానికరమో అర్థం చేసుకోవాలి.

# వంట చేసే మహిళలకు చిట్కాలు

**వంట గది..మహిళలు ఎక్కువ సమయం ఇక్కడనే కేటాయిస్తుంటారు. ఉదయం..మధ్యాహ్నం..రాత్రి సమయాల్లో ఇంటి వారికి కావాల్సిన వంటకాలు మహిళలు చేస్తుంటారు. వంట చేసే సమయాల్లో కొన్ని సమస్యలను ఎదుర్కొంటుంటారు. వంట గది శుభ్రంగా ఉంచుకోవడానికి పలు ప్రయత్నాలు చేస్తుంటారు. వంట గది..వంటల్లో నెలకొనే సమస్యల పరిష్కారానికి కొన్ని చిట్కాలు...**



- వంటగదిలో బొద్దింకలు..చీమలు ఎక్కువగా తిరుగుతూ ఇబ్బందులు పెడుతుంటాయి. బిర్యానీ ఆకును పొడి చేసి బొద్దింకలు తిరిగే చోట చల్లి చూడండి.
- ఒక దోసకాయను ముక్కలుగా తిరిగి చీమలు తిరిగే చోట పెట్టి చూడండి.
- వంట చేసే సమయాల్లో చేతులు మరకలవుతుంటాయి. మరకలు కాకుండా ఉండాలంటే ఆలుగడ్డ ముక్కలతో రుద్దాలి.
- చెక్కతో చేసిన వంట సామాగ్రి వాసన వస్తుంటాయి. ఇలా రాకుండా ఉండాలంటే వెనిగర్ కలిపిన నీటిలో వాటిని ఉంచాలి.
- చపాతిలు మృదువుగా రావాలంటే పిండి కలిపే సమయంలో ఉడికిన బంగాళ దుంప కలపండి.
- చపాతి పిండిలో పాలు లేదా గోరువెచ్చని నీళ్ల కలిపి ఓ అరగంట..గంట పాటు నాననబెడితే చపాతీలు మృదువుగా వస్తాయి.
- కూరల్లో మసాలా ఎక్కువైతే రెండు లేదా మూడు టమాటాలను ఉడికించి అందులో కలపండి. మసాలా ఘాటు తగ్గి మంచి రుచిగా వుంటుంది.
- పచ్చి బటానీలు రంగు మారకుండా ఉండాలంటే వాటిని ఉడికించే సమయంలో చిటికెడు పంచదార వేయాలి.
- కూరలో ఉప్పు ఎక్కువయిందనుకోండి అందులో కొద్దిగా బియ్యం పిండి కలపాలి.
- దోశల పిండి బాగా పులిస్తే అందులో రెండు చెంచాల గోధుమ పిండి కలిపి వేసుకుంటే దోశలు రుచిగా వస్తాయి.
- రాగి సామాగ్రి మీద నిమ్మరసం చల్లి ఉప్పుతో రుద్దితే కొత్త వాటిలా మెరిసిపోతాయి.
- పెనం నల్లగా తయ్యారైతే దానిమీద సబ్బునీళ్ళు పోసి సన్నటి సెగ మీద ఉంచి చల్లారాక రుద్దితే శుభ్రపడుతుంది.
- పచ్చి మిర్చికి గాట్లు పెడితే నూనెలో వేయించేటప్పుడు పేలకుండా ఉంటాయి.

# 1-3 వయస్సుపిల్లలకు వెరైటీ వంటలు

**పోషకాహారం మీ బిడ్డ శారీరక మరియు మానసిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది .ఒకటి(1) నుంచి మూడు(3) సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న పిల్లలకి సరిఅయిన పోషకాహారం అందించడం ఎంతో అవసరం. పిల్లల కోసం ఆరోగ్యకరమైన ఆహారం అల్పాహారంతో మొదలవుతుంది. అందుకని ముందుగా పసి పిల్లల కొరకు మంచి పోషకాలు కలిగిన అల్పాహార రెసిపీ.**


**రాగి ఇడ్లీ:**

**కావలసిన పదార్థాలు : (240 ml కప్ ఉపయోగించబడింది)**

2 కప్పులు ఇడ్లీ పిండి (మెత్తటి పిండి)
కప్ రాగి పిండి లేదా నాచినీ పిండి (తక్కువ ఉపయోగించవచ్చు కానీ ఎక్కువ వాడకూడదు )
కప్ నీరు +2 టేబుల్ స్పూన్లు గోరు వెచ్చని నీరు (అవసరమైతే 1 టేబుల్ స్పూన్ మరింత జోడించండి)
ఉప్పు (తగినంత )
స్పూన్ నూనె

**తయారీ విధానం**

ముందుగా కప్ నీటిని మరిగించండి.
ఒక బౌల్ లో రాగి పిండి ని తీస్కొని ,దానిలో తగినంత నీటిని కలుపుతూ చిక్కటి పేస్ట్ లాగ చేసుకోవాలి.



మరియు దానిని ఉపయోగించి ఇడ్లిస్ ని బయటకు తియ్యండి
ఒక చిటికెడు ఉప్పు
చిటికెడు పసుపు

తరువాత దానికి పులియబెట్టిన ఇడ్లీ పిండి మరియు ఉప్పు కలపండి. నీటిని శోషించటానికి పిండికి 15 నుండి 20 నిమిషాలపాటు పక్కన పెట్టండి.
ఇడ్లి స్టీమర్ లేదా కుక్కర్ లో నీటిని నింపుకొని ఉడికించడానికి సిద్ధం చేసుకోవాలి
ఇంతలో కుక్కర్ ప్లేట్స్ కి నూనె ని పూసి, ముందు గా తయారు చేసిన పిండి ని పోయాలి
కుక్కర్ లోని నీరు మరగడం ప్రారంభించాక పిండి పోసిన కుక్కర్ ప్లేట్స్ ను అందులో పెట్టండి
10 నిమిషాల పాటు మూత వేసి ఉడికించండి
ఉడికిన తరువాత మూత ని తెరిచి చల్లారనివ్వండి
నీటితో ఒక చెంచా అంచుని ముంచండి
సాంబార్ లేదా చట్నీతో రగి ఇడ్లీని వేడిగా మీ పిల్లలకు అందించండి.

**ఇప్పుడు భోజనంగా పిల్లలకు అందించడానికి ఉపయోగపడే వంటకం :**

**బంగాళాదుంప అన్నం**

**కావలసిన పదార్థాలు:**

2 టేబుల్ స్పూన్లు. దీర్ఘ ధాన్యం బియ్యం(లాంగ్ గ్రైన్)
50 గ్రాముల బంగాళదుంప
1/8 కారొమ్ సీడ్ పౌడర్ (వాము )
135 ml నీరు (ఉపయోగించిన బియ్యం రకం మీద ఆధారపడి ఉంటుంది)

**తయారీ విధానం**

ముందుగా బియ్యాన్నికడిగి గంట సేపు నానబెట్టాలి.
కడిగిన బియ్యానికి 135 ml నీరు, ఒలిచిన బంగాళాదుంపను జోడించండి
ఈ మిశ్రమాన్ని ప్రెషర్ కుక్కర్ లో 10 నిమిషాల పాటు ఉడికించండి
తరువాత దానికి కారొమ్ సీడ్ పౌడర్ మరియు పసుపు ని జతచేయండి
మృదువుగా ఉడికిన బియ్యం మరియు బంగాళాదుంపలను మాష్ చేసి చివరగా వెన్న జోడించండి.

**గమనిక**

ఈ రెసిపీ పిల్లల వయసుకు తగినట్టుగా వారికీ అందించాలి. 1 లేదా అంత కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలకు రైస్ (అన్నం) ముద్దగా మరియు మృదువుగా చేసి తినిపించాలి 23 వయసు పిల్లలకి ఏధావిధి గా రెసిపీ లో తెలిపిన విధం గా అందించవచ్చు.

**రాత్రి విందు (డిన్నర్)**

రాత్రి వేళలో అందించే ఆహారం మంచి పోషక విలువలు కలిగి ఉన్నదై ఉండాలి. ఎందుకంటే అది పిల్లలకు మంచి నిద్రని అందిస్తుంది

**క్యారెట్ బేబీ ఫుడ్ రెసిపీ:**

**కావలసిన పదార్థాలు**

ఒక కార్రోట్ ( పెద్దది )
6 లేక 8 బాదాం పప్పులు
బాదం పాలు / పాలు/ నీరు (తగినంత)
బెల్లం (కొద్దిగా తరిగినది )
1 /4 స్పూన్ నెయ్యి

**తయారీ విధానం**

ముందుగా బాదాం పప్పులను 6 గంటల పాటు నీటి లో నానబెట్టి ..పొట్టుని తియ్యాలి
తరువాత కార్రోట్ ని శుభ్రం గా కడిగి చిన్న చిన్న ముక్కలు గా తరగాలి
మిక్సర్ లో కార్రోట్ ముక్కలు, బాదాం ముక్కలు ,పాలు / నీటిని కలిపి మెత్తని పేస్ట్ లాగా బ్లెండ్ చేసుకోవాలి.ఆ తయారు అయినా పేస్ట్ ని ఒక గిన్నె లోకితీసుకోవాలి
అదే గిన్నెలో నీటిని పోసి మరిగించుకోవాలి.అలాగా ఒక 12 నుంచి 15 నిముషాల పాటు ఉడికించుకోవాలి
అది కాస్త చిక్కపడ్డాక బెల్లాన్ని కలపాలి
కలిపినా తరువాత చల్లారడానికి ఫ్రిడ్జ్లో పెట్టాలి. చల్లారిన తరువాత పిల్లలకు అందించండి.



# దామరచర్లను ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు

### బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

**నల్లగొండ, డిసెంబర్7 (వెలుతురు న్యూస్):** సీఎం రేవంత్ నల్లగొండ జిల్లా దామరచర్లలో నిర్మించిన యాదాద్రి విద్యుత్ కేంద్రంతోపాటు పలు ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఇప్పటికే దామరచర్లను పూర్తిగా ఆదీనంలోకి తీసుకున్న పోలీసులు జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేస్తున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచే అరెస్టుల పర్వం మొదలైంది. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్ రావును హౌస్ అరెస్టు చేశారు. అదేవిధంగా నల్లగొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డితోపాటు పలువురు పట్టణ పార్టీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. కనగల్ మాజీ ఎంపీపీ కరీం పాషా, తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులను అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఇక మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల్లో కూడా బీఆర్ఎస్ లీడర్లను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. తామేం తప్పు చేశామని అరెస్టు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

## మెడిసిన్ విద్యార్థిని సాయి సుదీక్షకు 2000 వేల చెక్‌ను అందజేసిన సేవాస్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు మదిపెల్లి మల్లేష్


**గోదావరిఖని,డిసెంబర్ 7, (వెలుతురు):** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 41 వ డివిజన్ గాంధీనగర్,కు చెందిన గద్దల అనిల్ కుమార్ కుమార్తె గద్దల సాయి సుదీక్ష కు ప్రతినెల 2000 వేల రూపాయల ప్యాకెట్ మనీ సేవా స్ఫూర్తి ఫౌండేషన్ తరపున అందజేస్తున్న విషయం తెలిసిందే, అందులో భాగంగా శనివారం, గాంధీ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు మడిపెల్లి మల్లేష్ విద్యార్థిని సాయి సుదీక్ష తండ్రి గద్దల అనిల్ కుమార్ కు 2000 వేల రూపాయల చెక్ ను



అందజేసినట్టు మడిపెల్లి మల్లేష్ తెలిపారు. అనంతరం మల్లేష్ మాట్లాడుతూ గత 35 నెలల నుండి సేవాస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులందరి సహకారంతో ఇతర దాతల సహాయంతో ప్రతి నెల సాయి సుదీక్ష కు 2000 రూపాయలు ప్యాకెట్ మనీ ఇస్తున్నామని మాట ఇచ్చిన ప్రకారం విద్యార్థిని చదువు 5 సంవత్సరాలు కోర్సు ఉంటుందని చదువు అయిపోయేవరకు ప్రతినెల మొదటి వారంలో 2000 వేల రూపాయలను అందజేస్తామని, తెలిపారు. ప్రతినెల ఫౌండేషన్ కు సహకారం అందిస్తున్న సేవా స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులందరికీ సోషల్ మీడియాలో నేను చేసే సేవలను చూసి ముందుకు వచ్చి సహాయం అందజేసిన దాతలకు ప్రతి ఒక్కరికి సాయి సుదీక్ష తరపున సేవా స్ఫూర్తి ఫౌండేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

## విద్యార్థులకు నోటు బుక్స్ పెన్నుల పంపిణీ

**గోదావరిఖని,డిసెంబర్ 7, (వెలుతురు):** జీడీకే టూ టౌన్ పోలీస్ ఏఎస్ఐ 1856 జీడికే టూ టౌన్ లో విధులు నిర్వహిస్తున్న గట్ల శ్రీనివాస్ వారి తండ్రి జ్ఞాపకార్థం గట్ల శ్రీనివాస్ కూతురు, వారి తాతగారి



జ్ఞాపకార్థం, శనివారం,అడ్డగుంటపల్లి ప్రైమరీ స్కూల్లో సుమారు 28 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్స్ పంపిణీ తాత కీర్తిశేషులు గట్ల చంద్రయ్య జ్ఞాపకార్థం గట్ల శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

## ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం

### - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, సతీమణి మానాలి

**గోదావరిఖని,డిసెంబర్ 7, (వెలుతురు):** గోదావరిఖని జీఎం కాలనీ ఉన్నటువంటి వల్లిసామెత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, శనివారం ఘనంగా నిర్వహించారు. మహోత్సవానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే సతీమణి,మక్కన్ సింగ్ సేవ సమితి చైర్మన్,మనాలి ఠాకూర్, హాజరయ్యారు.



అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామగుండం లోని సబ్బండ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని , రామగుండం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ,కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వెలమజాతిని కించపరుస్తూ షాద్‌ఎమ్మెల్యే శంకర్ వాక్యాలను ఖండించిన పద్మనాయక వెలమ సంఘం

**గోదావరిఖని,డిసెంబర్ 7, (వెలుతురు):** వ్యక్తిగతంగా ఉన్న సమస్యలో వెలమ జాతిని కించపరుస్తూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలను రామగుండం కార్పొరేషన్ పద్మానాయక వెలమ సంఘం అద్యక్షులు నడిపెల్లి రామ్మోహన్ రావు,నడిపెల్లి విద్యాసాగర్ రావు, బల్మూరి అమరేందర్ రావు, తీవ్రంగా ఖండించారు.

గోదావరిఖనిలోని ఆదిత్య రెసిడెన్సీ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ షాద్ నగర్ ఎమ్మెల్యే తనకు వ్యక్తిగతంగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తగాదాలలో మొత్తం వెలమ జాతిని లాగుతూ మాట్లాడడం సరైంది కాదని అన్నారు. అహంకార పూరితంగా మాట్లాడిన షాద్ నగర్ ఎమ్మెల్యే యావత్ వెలమ జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ విలేఖరుల సమావేశంలో వెలమ సంఘం నాయకులు మాల్ రాజ్ భాస్కర్ రావు, నడిపెల్లి రాజేశ్వర్ రావు, టి. మహేందర్ రావు,వేంకటేశ్వర్ రావు, జి.మదన్ మోహన్ రావు,కిషన్ రావు, జి.రవీందర్ రావు, పాల్గొన్నారు.



# నిజాంసాగర్ పర్యాటకానికి పూర్వ వైభవం

### 10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు చర్యలు

### పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**కామారెడ్డి, డిసెంబర్7 (వెలుతురు న్యూస్):** నిజాంసాగర్ పర్యాటకానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటక ప్రమోషన్‌లో భాగంగా ప్రాజెక్టు ను సందర్శించారు. నిజాంసాగర్‌లో ప్రాచీన కట్టడాలైన గోల్‌బంగ్లా, గుల్‌గస్త్ బంగ్లా, వీఐపీ గార్డెన్, స్విమ్మింగ్ పూల్, తదితర కట్టడాలను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుతో కలిసి పరిశీలించారు. పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను సంబంధిత అధికారులతో చర్చించారు. నిజాంసాగర్ జాలాశాయంతో పాటు పరిసరాల ప్రాంతాల అభివృద్ధికి 12 ఎకరాల స్థలాన్ని పర్యాటక అభివృద్ధి సంస్థకు రెవెన్యూ శాఖ అప్పగించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులకు జలాశయంలో ఆహ్లాదం కోసం బోటింగ్, డ్యాం దిగువన కాటేజీలు, ఉద్యానవనం, చిన్న పిల్లల పార్కు తదితర సౌకర్యాలు అందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అనంతరం నిజాజంసాగర్ హైడ్రో పవర్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల వర ప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టు పర్యాటక ప్రదేశాలు అద్భుతంగా ఉందని, వందేండ్లు గడిచినా చెక్కుచెదరలేదని అన్నారు. మూడు కాలాలు ఎప్పుడూ నిండుకుండలా ఉన్న నిజాంసాగర్ జలాశయం పర్యాటక అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ) ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. తెలంగాణలో ఉన్న పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు త్వరలోనే నూతన పర్యాటక పాలసీ అమల్లోకి తెస్తామని వెల్లడించారు.

నిజాంసాగర్ హైడ్రో పవర్ స్టేషన్‌లో 10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో చర్చించి, దీన్ని పూర్తిగా ఆధునీకరిస్తామని పేర్కొన్నారు.

# భూదాన్ పోచంపల్లి రోడ్డు ప్రమాదం

### ఐదుగురు యువకులు జలసమాధి

**భువనగిరి, డిసెంబర్7 (వెలుతురు న్యూస్):** చెరువులోకి కారు దూసుకెళ్లడంతో ఐదుగురు యువకులు మృతి చెందిన సంఘటన భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. మృతులను వంశీగౌడ్, దినేశ్, హర్ష, బాలు, వినయ్‌గౌడ్‌గా గుర్తించారు. వారంతా 22 నుంచి 25 ఏండ్ల మధ్య వయస్కులేనని వెల్లడించారు. ప్రమాద సమయంలో కారులో ఆరుగురు ఉన్నారని తెలిపారు. మణికంఠ అనే యువకుడు క్షేమంగా ఉన్నాడని పేర్కొన్నారు. వారంతా హైదరాబాద్ హయత్‌నగర్ ఆర్టీసీ కాలనీకి చెందినవారని తెలిపారు. ఎల్బీనగర్ నుంచి పోచంపల్లి వెళ్తుండగా జలాల్‌పూర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు వద్ద అదుపుతప్పిన కారు చెరువులోకి దూసుకెళ్లిందన్నారు. మృతదేహాలను భువనగిరి దవాఖానకు తరలించారు. వంశి డ్రైవింగ్ చేస్తున్నాడని, ఉదయం 4.30 గంటలకు ప్రమాదం జరిగిందని మణికంఠ వెల్లడించారు. ప్రమాద సమయంలో కారు వేగంగా ఉందని, కారు రెండు పల్టీలు కొట్టి చెరువులో పడిందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# తుమ్మల వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపాటు

### అన్నదాతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోం : మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్7 (వెలుతురు న్యూస్):** డబ్బులు వచ్చే వ్యవసాయం చేయాలే తప్ప.. అడుక్కుతినే బతుకు వద్దంటూ రైతులను ఉద్దేశించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి, రైతును రహదారుల పైకి లాగిన మీరా రైతుల గురించి మాట్లాడేదని మండిపడ్డారు. రైతు భరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో కనికట్టు చేసిన మీరా రైతుల గురించి మాట్లాడేదంటూ ధ్వజమెత్తారు. రైతులు ఎప్పుడూ ఆశపడతారు తప్ప అడుక్కోరని చెప్పారు. వారికి సమయం రాకపోదని, మీకు తగిన గుణపాఠం చెప్పకపోరంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. 'రైతే రాజు నినాదం కాదు కేసీఆర్ ప్రభుత్వ విధానం. అడగకుండానే రైతుబంధు.. అడగకుండానే రైతుబీమా.. అడగకుండానే సాగునీళ్లు.. అడగకుండానే ఉచితంగా 24 గంటల కరంటు.. అడగకుండానే 100 శాతం పంటల కొనుగోళ్లు. దశాబ్దాల కాంగ్రెస్ పాలనతో వ్యవసాయ రంగం వెన్నువిరిగి, బతుకుదెరువు కోసం వలసబాట పట్టిన అన్నదాతలలో ఆత్మవిశ్వాసం నింపి వ్యవసాయం దండగ కాదు పండగ అని చాటిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. కరోనా విపత్తులోనూ కర్షకులకు బాసటగా నిలిచిన చరిత్ర కేసీఆర్ గారిది. ప్రతి ఊరికీ వెళ్లి పంటలు కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ గారిది. రైతుబంధును రాజకీయం చేసి, రైతుభరోసా అంటూ భ్రమలు కల్పించి, రైతుభీమాను మాయం చేసి, 24 గంటల ఉచిత విద్యుత్తును ప్రశ్నార్థకం చేసి.. పంటల కొనుగోళ్లకు పాతరవేసి సాగునీళ్లను సాగనంపి.. అన్నదాతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి రైతును రహదారుల పైకి లాగిన మీరా.. రైతుల గురించి మాట్లాడేది! రైతుభరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో కనికట్టు చేసిన మీరా.. రైతుల గురించి మాట్లాడేది! ఇల్లిల్లూ తిరిగి అబద్ధపు హామీలు ఇచ్చి నాడు ఓట్లు అడుక్కున్న చరిత్ర మీది. అధికారం దక్కాక ఇల్లిల్లూ తిరిగి ఎమ్మెల్యేలను అడుక్కుని, కొనుక్కున్న చరిత్ర మీది. రైతులు ఎప్పుడూ.. ఆశపడతారు తప్ప అడుక్కోరు. సమయం రాక పోదు, మీకు గుణపాఠం చెప్పక పోరు. జాగో తెలంగాణ జాగో' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.



## విరాళం దాతలకు సంవత్సరానికి
# మూడుసార్లు వీఐపీ బ్రేక్ దర్శనాలు

**తిరుమల,డిసెంబర్7 (వెలుతురు న్యూస్):** ఆనంద నిలయం అనంత స్వర్ణమయం పథకానికి విరాళం ఇచ్చిన దాతలకు వీఐపీ బ్రేక్ (జనరల్) దర్శనాలను ఇవ్వాలని టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది. 2008లో టీటీడీ సంకల్పించిన ఈ పథకాన్ని కొన్ని అనివార్య కారణాల వల్ల నిలిపివేశారు. అప్పట్లో ఈ పథకానికి విరాళం ఇచ్చిన దాతలకు అర్చనానంతర దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అర్చనానంతర దర్శనానికి బదులుగా గరిష్టంగా 5గురు కుటుంబ సభ్యులకు సంవత్సరానికి 3 రోజులు వీఐపీ బ్రేక్ జనరల్ దర్శనాలకు అనుమతి ఇవ్వాలని, రూ. 2,500 టారిఫ్‌లో సంవత్సరానికి 3 రోజులు వసతి , సంవత్సరానికి ఒకసారి 20 చిన్న లడ్డూలు ప్రసాదంగా అందించాలని నిర్ణయించింది.

దాతల దర్శన సమయంలో సంవత్సరానికి ఒకసారి బహుమానంగా ఒక దుపట్టా, ఒక బ్లౌజ్, మొదటిసారి దర్శన సమయంలో 5 గ్రాముల బంగారు డాలర్, 50-గ్రాముల వెండి నాణెం బహుమానంగా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. సంవత్సరానికి ఒకసారి పది మహాప్రసాదం ప్యాకెట్లు, విరాళం పాస్‌బుక్ జారీ చేసిన తేదీ నుంచి 25 సంవత్సరాల పాటు ఈ సేవలు అందుతాయని స్పష్టం చేసింది.

# మరోసారి భూప్రకంపనలు

**హైదరాబాద్,డిసెంబర్7 (వెలుతురు న్యూస్):** తెలంగాణను మరోసారి భూప్రకంపనలు వణికించాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం 1.22 గంటల ప్రాంతంలో కొద్ది సెకండ్ల పాటు భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.0గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. కౌకుంట్ల మండలం



దాసరిపల్లి సమీపంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని ప్రభావంతో కృష్ణ పరివాహక ప్రాంతంలో, జూరాల ప్రాజెక్టుకు ఎగువ, దిగువన ప్రాంతాల్లో భూప్రకంపలు వచ్చాయి. మూడు రోజుల కిందట కూడా తెలుగు రాష్ట్రాల్లో భూప్రకంనపలు సంచలనం సృష్టించాయి. రిక్టర్ స్కేలుపై 5.3 తీవ్రతతో గోదావరి పరివాహక ప్రాంతాల్లో వచ్చిన ఈ భూకంపం కారణంగా తెలంగాణలోని హైదరాబాద్, హనుమకొండ, వరంగల్, కరీంనగర్, సిద్దిపేట, నల్గొండ, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఏడు సెకండ్ల దాకా భూ ప్రకంపనలు వచ్చాయి. తెలంగాణలోని ములుగు జిల్లా మేడారంలో భూకంపం కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం కేంద్రానికి చుట్టూ 232 కిలోమీటర్ల పరిధిలో దాని ప్రభావం కనిపించినట్టు పేర్కొన్నారు. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇంతకుముందు 2018లో చివరిసారిగా తెలంగాణలో భూమి కంపించింది. కాగా 5 కన్నా అధిక తీవ్రతతో దక్షిణ భారతంలో భూమి కంపించడం 55 ఏండ్ల తరువాత అదే మొదటిసారి. భూకంపాలు సంభవించే ప్రాంతాలను, వాటి తీవ్రత దృష్ట్యా జోన్2, జోన్-3, జోన్-4, జోన్-5గా నాలుగు జోన్లుగా విభజించారు. జోన్-5 అత్యంత భూకంప క్రియాశీల ప్రాంతం. అతితక్కువ తీవ్రత కలిగిన ప్రాంతం జోన్-2. ప్రస్తుతం తెలంగాణ అతి తక్కువ స్థాయి భూకంపాలు సంభవించే జోన్-2లో ఉంది. గోదావరి పరివాహక ప్రాంతంలో ఫాల్ట్ జోన్ ఉంది. ఇది భూకంపానికి కారణ మవుతుంది. ఫాల్ట్ జోన్ అంటే భూమి అంతర్భాగంలో రెండు బ్లాకులు ఒకదానితో ఒకటి అకాస్మాత్తుగా జారిపోయే ప్రదేశం. ఒక్కోసారి అంతర్భాగంలో సర్దుబాటుల కారణంగా విడుదలయ్యే అపారమైన శక్తి భూకంపాలుగా వస్తుంది. గోదావరి బేసిన్‌లో పలు చోట్ల పగుళ్లు, లోపాటు ఉన్నట్లు భూకంప శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇదే ఈ ప్రాంతంలో భూకంపాలకు కారణమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## అజిత్ పవార్‌కు భారీ ఊరట

**న్యూఢిల్లీ, డిసెంబర్7 (వెలుతురు న్యూస్):** డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే అజిత్ పవార్‌కు భారీ ఊరట లభించింది. గతంలో సీజ్ చేసిన కోట్లు విలువైన బినామీ ఆస్తులను ఆదాయపన్ను శాఖ తాజాగా క్లియర్ చేసింది. అజిత్ పవార్, అతని కుటుంబ సభ్యులు బినామీ ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను ఆదాయ పన్నుశాఖ (ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్)కు చెందిన బినామీ ఆస్తుల లావాదేవీల నిరోధక అప్పిలెట్ ట్రిబునల్ కొట్టిపారేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఊరట కల్పించింది. కాగా, బినామీ ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై 2021 అక్టోబర్ 7న అజిత్ పవార్‌కు చెందిన సుమారు 1000 కోట్ల ఆస్తులను ఆదాయపన్ను శాఖ సీజ్ చేసిన విషయం తెలిసిందే. ముంబైలోని నారీమన్ పాయింట్ వద్ద ఉన్న నిర్మల్ టవర్‌తో పాటు మొత్తం ఐదు ప్రాపర్టీలను ఐటీ శాఖకు అటాచ్ చేసింది. వాటిలో నిర్మల్ టవర్‌తోపాటు సతారాలోని షుగర్ ఫ్యాక్టరీ, ఢిల్లీలోని ఫ్లాట్, గోవాలోని రిసార్ట్ సహా పలు ఆస్తులు ఉన్నాయి. బినామీ ప్రాపర్టీల లబ్ధిదారుల్లో అజిత్ పవార్, ఆయన కుటుంబం ఉన్నట్లు ఆదాయపన్ను శాఖ అధికారులు అప్పుడు ఓ ప్రకటనలో తెలిపారు. అజిత్ ఫ్యామిలీపై యాంటీ బినామీ చట్టం కింద కేసు బుక్ చేశారు. అజిత్ తన ఆస్తులను న్యాయమైన పదప్తిలో ఆర్జించలేదని ఐటీశాఖ తెలిపింది. అయితే తనకు లింకు ఉన్న అన్ని సంస్థలు క్రమ పద్ధతిలో పన్నులు చెల్లించినట్లు అజిత్ పవార్ చెప్పారు. ప్రతి ఏడాది పన్నులు చెల్లిస్తామని, ఆర్థిక మంత్రి అయినప్పటి నుంచి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నానని, తనతో లింకున్న అన్ని కంపెనీలు పన్నులు చెల్లించినట్లు అజిత్ వెల్లడించారు.

## కేరళ నర్సులపై భారీ కేసులు నమోదు

**కొచ్చి, డిసెంబర్7 (వెలుతురు న్యూస్):** కేరళ నర్సులపై భారీ కేసులు నమోదు అయ్యాయి. కువైట్‌కు చెందిన గల్ఫ్ బ్యాంక్ నుంచి కోట్ల రుణం తీసుకుని ఉడాయించారు. సుమారు 1400 మంది మలయాళీలు.. దాదాపు 700 కోట్ల రుణం తీసుకుని ఎగ్గొట్టినట్లు తెలుస్తోంది. సాలరీ సర్టిఫికేట్లను గ్యారెంటీగా పెట్టి .. గల్ఫ్ బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేరళలో దర్యాప్తు మొదలైంది. ఈ నేపథ్యంలో గల్ఫ్ బ్యాంక్‌కు చెందిన డిప్యూటీ జనరల్ మేనేజర్ కేరళను విజిట్ చేశారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీపీకి ఆయన ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఇప్పటికే 10 కేసులు నమోదు చేశారు. ఎర్నాకుళం, కొట్టాయం జిల్లాల్లో ఆ కేసులు నమోదు అయ్యాయి. ఒక్కొక్క నర్సు సుమారు 50 లక్షల నుంచి 2 కోట్ల వరకు రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. గల్ఫ్ బ్యాంక్ కువైట్ షేర్‌హోల్డింగ్ కంపెనీ లో మోసం జరిగినట్లు గుర్తించారు. నిందితుల్లో ఎక్కువ శాతం మంది నర్సులే ఉన్నట్లు తేలింది. డిఫాల్టర్ల వివరాలను పోలీసులకు బ్యాంకు వెల్లడించింది. ఆ వివరాల ఆధారంగా కేసులను రిజిస్టర్ చేస్తున్నారు. మూడు నెలల క్రితం బ్యాంకులో ఫ్రాడ్ జరిగినట్లు గుర్తించారు. తొలుత చిన్న రుణాలను తీసుకుని.. వాటిని సకాలంలో చెల్లించేవారు. దీంతో బ్యాంకు నమ్మకాన్ని గెలుచుకునేవారు. 2020 నుంచి 2022 మధ్య కాలంలో ఈ ఫ్రాడ్ జరిగింది. ఆ తర్వాత భారీ మొత్తంలో లోన్ తీసుకుని.. విదేశాలకు లేదా స్వంత దేశాలకు వెళ్లి పోతున్నట్లు బ్యాంక్ ఆరోపించింది. రుణం తీసుకున్న వారి లోకల్ అడ్రెస్సులు బ్యాంక్ వద్ద ఉన్నాయి. ఆ వివరాలను పోలీసులకు అందజేశారు. చాలా ప్లాన్ ప్రకారం ఫ్రాడ్ జరిగినట్లు గుర్తించిన బ్యాంకు అధికారులు.. ఈ కేసులో దర్యాప్తు కోసం కేరళ పోలీసుల్ని ఆశ్రయించారు.



## హీరోయిన్‌ను పెళ్లాడిన
# కలర్‌ఫొటో డైరెక్టర్

కలర్ ఫొటో సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సందీప్ రాజ్, నటి చాందినీ రావు మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. తిరుమలలో వీరిద్దరి పెళ్లి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హీరో సుహాస్ దంపతులతో పాటు నటుడు వైవా హర్ష తదితరులు హాజరై సందడి చేశారు. సందీప్ పెళ్లికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కలర్‌ఫొటో సినిమాతో డైరెక్టర్‌గా మంచి ఫేం సంపాదించాడు సందీప్ రాజ్. ప్రముఖ యూట్యూబ్ ఛానల్ ఛాయి బిస్కెట్‌లో షార్ట్ ఫిలిమ్స్‌తో కెరీర్ మొదలుపెట్టిన ఈ యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ డెబ్యూ సినిమాగా కలర్ ఫొటో ఓటీటీలో విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. నటి చాందీని రావు విషయానికి వస్తే.. కలర్‌ఫొటో, రణస్థలి, హెడ్ అండ్ టేల్స్‌తోపాటు పలు వెబ్ సిరీస్‌లలో నటించించింది. చాందిని రావు ప్రొడక్షన్ హౌస్‌ను కూడా మెయింటైన్ చేస్తుంది. సందీప్ రాజ్ ప్రస్తుతం రోషన్ కనకాలతో  సినిమా ప్రకటించాడని తెలిసిందే.

# పుష్ప 2కు అండగా నిలిచిన జాన్వీకపూర్



అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమాకు హాలీవుడ్ చిత్రం ఇంటర్‌స్టెల్లార్ సినిమాకు సంబంధించి ఉత్తరాదిలో వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలాన్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం ఇంటర్‌స్టెల్లార్. 2014లో విడుదలైన ఈ చిత్రం హాలీవుడ్‌లోనే కాకుండా ఇండియాలోను మంచి కలెక్షన్లు సాధించింది. అయితే ఈ సినిమా 10 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మేకర్స్ రీ రిలీజ్ ప్లాన్ చేశారు. ఈ సినిమాను ఐమాక్స్ వెర్షన్ మాత్రమే రిలీజ్ చేయనుండగా.. ఇండియాలో కాకుండా వరల్డ్ వైడ్‌గా విడుదల చేస్తుంది చిత్రబృందం. దీనికి ముఖ్య కారణం ఇండియాన్ ఐమాక్స్‌ల్లో 'పుష్ప 2' ఉండటం. దీంతో ఇండియన్స్‌కు అసలు సినిమాలు చూడడం రాదని.. సైన్స్ ఫిక్షన్ వదిలేసి మాస్ సినిమాలకు ఎంకరేజ్ చేస్తున్నారని కొందరూ కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. అయితే ఈ వివాదంపై బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ స్పందిస్తూ.. 'పుష్ప2' సినిమాకు మద్దతుగా నిలిచింది. జాన్వీ మాట్లాడుతూ.. 'పుష్ప 2' కూడా ఒక సినిమానే కదా.. ఇంటర్‌స్టెల్లార్ సినిమాతో ఈ సినిమాను పోలుస్తూ ఎందుకు తక్కువ చేస్తున్నారు. ఏ హాలీవుడ్ సినిమాను మీరు సపోర్ట్ చేస్తున్నారో వాళ్లే ఇప్పుడు ఇండియన్ సినిమాల గురించి చర్చించుకుంటున్నారు.. ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ మనం మాత్రం మన సినిమాలను తక్కువ చేసుకుంటూ మనల్ని మనమే అవమానించుకుంటూ ఉండిపోతున్నాం. ఇలాంటివి చూసినప్పుడు బాధగా ఉంటుంది అంటూ జాన్వీ రాసుకోచ్చింది. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.

## తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్
# కార్పొరేషన్ చైర్మన్‌గా దిల్‌రాజు



టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజుకు  తెలంగాణ ప్రభుత్వం కీలక పదవి కల్పించింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయనను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యార్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ఈ పదవిలో రెండేండ్ల పాటు కొనసాగనున్నారు.  దిల్ రాజు అసలు పేరు వెంకటరమణా రెడ్డి. 1990లో పెళ్లి పందిరి సినిమాతో డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్ ప్రారంభించారు. అనంతరం దిల్ సినిమాతో నిర్మాతగా మారారు. ఆ చిత్రం విజయం సాధించడంతో ఆయన పేరు దిల్ రాజుగా మారింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై సినిమాలు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్ సినిమాలే కాకుండా చిన్ని చిత్రాలు కూడా నిర్మిస్తూ అనేకమందికి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్నవారిని ప్రోత్సహించేందుకు గాను దిల్ రాజు డ్రీమ్స్ పేరుతో కొత్త బ్యానర్ ప్రారంభిస్తున్నానని ఇటీవలే ప్రకటించారు. దీనికోసం ఒక వెబ్‌సైట్‌ను కూడా లాంచ్ చేయనున్నారు. ఆయన ప్రస్తుతం మూడు సినిమాలకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అగ్రదర్శకుడు శంకర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో ఆయన నిర్మించిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్' జనవరి 10న, వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న విడుదల కానున్నాయి. వీటితోపాటు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నారు.

# ఇంకేప్పుడు నటించొద్దు అన్నారు..? : రష్మిక

'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో అభినందనలు అందుకుంటున్న అందాల రష్మిక.. తన తాజా ఇంటర్వ్యూ ద్వారా ఆనందాన్ని వ్యక్తంచేస్తూ.. పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. "శ్రీవల్లి' లాంటి పాత్ర చేసినందుకు నన్నందరూ మంచి నటి అని మెచ్చుకుంటున్నారు. కానీ నా స్కూల్ టైమ్‌లో ఓసారి స్టేజ్ షో చేశా. అది ఎవరికీ నచ్చలేదు. కొందరైతే.. 'ఇంకెప్పుడూ నటించకు' అని ఉచిత సలహా కూడా పారేశారు' అంటూ అందంగా నవ్వేసింది రష్మిక. ఇంకా చెబుతూ 'పదిమందిలో ఉన్నప్పుడు అక్కడ నన్నెవరూ నవ్వుతూ పలకరించకపోతే.. ఆ ప్రదేశంలో నేనుండలేను. అది నా బలహీనత. అంతేకాదు, కొన్ని రూమర్ల వల్ల కూడా కన్నీరు పెట్టుకున్న సందర్భాలున్నాయి. నా రెమ్యునరేషన్ గురించి ఏవేవో రాశారు. నిజానికి డబ్బు గురించి అస్సలు పట్టించుకోను. తొలి సినిమాకు తీసుకున్న పారితోషికం కేవలం రెండున్నర లక్షలు. నాకు క్యారెక్టర్ ముఖ్యం. అయితే.. డబ్బు తక్కువ ఇచ్చినా పర్లేదు కానీ.. ఫ్రీగా మాత్రం చేయకూడదనేది నా పాలసీ' అని చెప్పారు 'ఓ మంచి బయోపిక్‌లో నటించాలి. అలాగే.. 'బాహుబలి'లో దేవసేన లాంటి పాత్ర చేయాలి. ఈ రెండు కోరికలు ఎప్పుడు తీరతాయా అని ఎదురు చూస్తున్నా' అని తెలిపారు రష్మిక. ప్రస్తుతం రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్, కుబేర, సికిందర్, ఛావా, థామ చిత్రాల్లో నటిస్తూ ఆమె బిజీబిజీగా ఉన్నది.



# చిరంజీవి విశ్వంభరా ఆరోజైనా..?



చిరంజీవి 'విశ్వంభర' సినిమా కోసం మెగా అభిమానులంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. నిజానికి ఈ సినిమా సంక్రాంతికి రావాల్సింది. కానీ 'గేమ్ చేంజర్' సంక్రాంతికి వస్తుండటంతో 'విశ్వంభర'ని వాయిదా వేయాల్సొచ్చింది. ఇటీవలే చిత్రీకరణ పూర్తిచేశారు. రిలీజ్ డేట్‌ని మాత్రం మేకర్స్ ప్రకటించలేదు. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాను ఏప్రిల్ 10న విడుదల చేయడానికి నిర్మాతలు వి.రామకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్‌రెడ్డిలు సన్నాహాలు చేస్తున్నారట. ఇదిలావుంటే.. అటు ఇటుగా అదేటైమ్‌లో ప్రభాస్ 'రాజా సాబ్' సినిమా కూడా విడుదలకు సిద్ధమవున్నది. ఏప్రిల్ రెండోవారంలో 'రాజా సాబ్' రిలీజ్ కానున్నట్లు గతంలోనే చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే.. ప్రభాస్ అనుబంధ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న 'విశ్వంభర'కు పోటీగా, ప్రభాస్ 'రాజా సాబ్' రావడం జరిగే పని కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏమవుతుందో చూడాలి. ఇదిలావుండగా ఇటీవలే చిరంజీవి కొత్త సినిమా ప్రకటన వెలువడిన విషయం తెలిసిందే. యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించనున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం.

# సాయిపల్లవితో నటించాలంటే భయం : చైతన్య

టాలీవుడ్ అగ్ర కథానాయికలలో సాయిపల్లవి ఒకరు. భానుమతి హైబ్రిడ్ పిల్లా అంటూ ఫిదా సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే కుర్రకారు మనసులను దోచుకుంది ఈ భామ. అనంతరం మిడిల్ క్లాస్ అబ్బాయి, పడి పడి లేచే మనసు, లవ్ స్టోరీ, శ్యామ్ సింగరాయ్, విరాట పర్వం తదితర చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ భామ. ప్రస్తుతం నాగ చైతన్యతో తండేల్ అనే సినిమాలో నటిస్తుంది. అయితే రీసెంట్‌గా ఒక టాక్ షోలో పాల్గోన్న నాగ చైతన్య సాయి పల్లవి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. దగ్గుబాటి హోస్ట్‌గా చేస్తున్న టాక్ షో ది రానా దగ్గుబాటి షో. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమవుతున్న ఈ షోలో రీసెంట్‌గా నాగ చైతన్య గెస్ట్‌గా వచ్చాడు. అయితే షోలో భాగంగా రానా సాయి పల్లవి గురించి అడుగగా.. చైతూ మాట్లాడుతూ.. సాయిపల్లవితో నటించాలి అన్న.. డాన్స్ చేయాలన్న భయం వచ్చేస్తది బావ (రానా). నువ్వు సాయిపల్లవితో విరాట పర్వం సినిమా చేసి ఒక్క సాంగ్ కూడా పెట్టకుండా భలే తప్పించుకున్నావు. కానీ నాకు అలా లేదు తనతో చేసేటప్పుడు నేను బానే చేస్తున్నానా అని సందేహం వస్తుంది అంటూ నాగ చైతన్య చెప్పుకోచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.





## అమీర్‌ఖాన్ తనయుడితో
# సాయిపల్లవి ప్రేమాకథ

దక్షిణాదిలో తిరుగులేని గుర్తింపును సంపాదించుకున్న అగ్ర కథానాయిక సాయిపల్లవి ఇప్పుడు బాలీవుడ్‌పై దృష్టి పెడుతున్నది. 'రామాయణ' చిత్రం ద్వారా ఆమె హిందీ చిత్రసీమలోకి అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాతో పాటు అమీర్‌ఖాన్ తనయుడు జునైద్‌ఖాన్‌తో కలిసి ఓ ప్రేమకథా చిత్రంలో నటిస్తున్నది. అమీర్‌ఖాన్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు సునీల్‌పాండే దర్శకుడు. ఈ చిత్రానికి 'ఏక్ దిన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని అమీర్‌ఖాన్ స్వయంగా వెల్లడించారు. హృద్యమైన ప్రేమకథాంశమిదని, ఈ సినిమాతో సాయిపల్లవి ఉత్తరాది యువతకు చేరువవుతుందని చిత్రబృందం పేర్కొంది. ఇదిలావుండగా ఇటీవల విడుదలైన 'అమరన్' చిత్రంలో సాయిపల్లవి అద్భుతాభినయానికి సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. ఈ సినిమా బాలీవుడ్‌లో కూడా హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి హిందీ సినిమాల తాలూకు అప్‌డేట్స్‌పై అక్కడి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com